ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
విశాఖపట్నం
జిల్లా వార్తలు
గురువారం 5 సెప్టెంబరు 2024



సాయిరెడ్డి కుమార్తె అక్రమ నిర్మాణం తొలగింపు

భీమిలి సమీపాన సముద్ర తీరానికి ఆనుకుని నిర్మాణం

- సీఆర్‌జెడ్ నిబంధనల ఉల్లంఘన
- కోర్టు ఆదేశాల మేరకు చర్యలు తీసుకున్న జీవీఎంసీ అధికారులు

వైసీపీ నేత, రాజ్యసభ సభ్యుడు వి.విజయసాయిరెడ్డికి మహా విశాఖ నగర పాలక సంస్థ (జీవీఎంసీ) అధికారులు షాక్ ఇచ్చారు. ఆయన కుమార్తె నేహారెడ్డి విశాఖ జిల్లా భీమిలి సమీపాన బీచ్‌రోడ్డులో సీఆర్‌జెడ్ నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన నిర్మాణాలను హైకోర్టు ఆదేశాల మేరకు బుధవారం తొలగించారు.

- వార్త మెయిన్‌లో

నగరంలో వర్షం



బుధవారం రాత్రి నగరంలో వర్షం



అక్రమ కట్టడాన్ని కూల్చివేస్తున్న సిబ్బంది

విశాఖపట్నం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉపరితల ఆవర్తనం ప్రభావంతో నగరంలో బుధవారం పలు దఫాలుగా వర్షం కురిసింది. ఉదయం మద్దిలపాలెం, సీతంపేట, రామాటాకీస్ ప్రాంతాల్లో ఒక మోస్తరు వర్షం పడింది. తిరిగి సాయంత్రం ఒక్కసారిగా వర్షం మొదలైంది. కోస్తా మీదుగా విస్తరించిన రుతుపవనద్రోణి, ఉపరితల ఆవర్తనం ప్రభావంతో రుతుపవనాలు చురుగ్గా మారినందున బుధవారం రాత్రి జిల్లాలో భారీవర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించింది. ఇక గురువారం పశ్చిమ మధ్య వాయువ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనున్నందున అల్లూరి, అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాల్లో వర్షాలు పెరుగుతాయని పేర్కొంది. ఈనెల ఆరు, ఏడు తేదీల్లో అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాల్లో అక్కడక్కడా భారీవర్షాలు కురుస్తాయని వెల్లడించింది. ఎనిమిదో తేదీ వరకు ఉత్తరాంధ్రలో తీరం వెంబడి గంటకు 35 నుంచి 45 అప్పుడప్పుడు 55 కి.మీ. వేగంతో బలమైన గాలులు వీయనున్నందున మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లరాదని హెచ్చరించింది.

వినాయక పందిళ్లకు అనుమతులపై గందరగోళం

కలెక్టరేట్‌లో సింగిల్ విండో కౌంటర్ ఎత్తివేత

- ఇకపై ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవలసిందిగా సూచన
- వారం రోజుల కిందట దరఖాస్తులనే క్లియర్ చేయలేదన్న విమర్శలు

విశాఖపట్నం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పందిళ్లకు అనుమతుల వ్యవహారం గందరగోళంగా మారింది. అనుమతులు ఇచ్చేందుకు కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన సింగిల్‌విండో కౌంటర్ మంగళవారం సాయంత్రం ఎత్తివేశారు. బుధవారం నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని చెప్పడంతో పలువురు ఆ దిశగా (గణేష్ ఉత్సవ్ వెబ్‌సైట్) యత్నించారు. అయితే వెబ్‌సైట్ గంటలకొద్దీ మొరాయించింది. దీంతో కొందరు సమీపంలోని పోలీస్ స్టేషన్లకు వెళ్లి వివరాలు అడుగుతున్నారు. అయితే వారం కిందట ఆన్‌లైన్‌లో పెట్టుకున్న దరఖాస్తులనే ఇప్పటివరకూ క్లియర్ చెయ్యలేదు. సింగిల్ విండో ద్వారా వచ్చిన 111 దరఖాస్తులను పోలీసులకు అందజేశామని కలెక్టరేట్ వర్గాలు చెబుతున్నాయి. ఈనెల ఏడో తేదీనే వినాయక చవితి. అంటే కేవలం రెండు రోజులు మాత్రమే సమయం ఉంది. ఆన్‌లైన్‌లో నమోదైన దరఖాస్తుదారులకు ఇంత స్వల్ప వ్యవధిలో జీవీఎంసీ, ఈపీడీసీఎల్, రోడ్లు, భవనాల శాఖ, పోలీసులు అనుమలులు ఇవ్వడం సాధ్యమేనా అన్న అనుమానం వ్యక్తమవుతుంది. దీనిపై పోలీసులు ఏ విధంగా స్పందిస్తారో చూడాలి.

ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు పోర్టల్ ఏర్పాటు

వినాయక చవితిని పురస్కరించుకుని ఏర్పాటుచేసే పందిళ్లకు అనుమతుల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఇందుకు 'హెచ్‌టీటీపీ://గణేష్‌ఉత్సవ్.నెట్' పేరిట ప్రత్యేకించి ఒక పోర్టల్‌ను రూపొందించారు. తొలుత కలెక్టరేట్‌లో సెల్ ఏర్పాటుచేసి ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించారు. ఈ నెల ఒకటో తేదీన ప్రారంభించిన ఈ కౌంటర్‌కు మొత్తం 111 దరఖాస్తులు రాగా వాటిని నగర పోలీస్ కమిషనరేట్‌కు పంపారు. ప్రాంతాల వారీగా సంబంధిత పోలీస్ స్టేషన్లే అనుమతులు మంజూరు చేస్తాయని కలెక్టరేట్ వర్గాలు తెలిపాయి. ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు తీసుకునే విధానం మంగళవారంతో నిలిపివేశారు. ఈ నేపథ్యంలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే ప్రక్రియ బుధవారం ప్రారంభించారు. మండపానికి అనుమతి కోసం ప్రత్యేకించి రూపొందించిన వెబ్‌సైట్‌కు వెళ్లి తొలుత రిజిస్టర్ చేసుకోవాలి. తరువాత పలు విభాగాల నుంచి నిరభ్యంతర పత్రం తీసుకోవడంతోపాటు మీ-సేవలో ఈపీడీసీఎల్, జీవీఎంసీ ఫైర్ విభాగాలకు రూ.500 వంతున చెల్లిస్తూ చలానా తీసుకోవాలి. ఇంకా పందిళ్లలో ప్రతిష్ఠించే బొమ్మ ఎత్తు బట్టి...అంటే ఎనిమిది అడుగుల వరకూ రూ.700, 8.1 అడుగుల నుంచి 15 అడుగుల వరకు రూ.1000, 15.1 అడుగుల నుంచి 30 అడుగుల వరకూ అయితే రూ.1400 చలానాను మీ-సేవా కేంద్రంలో చెల్లించాలి. వీటిని ఆయా విభాగాలకు వెళ్లి సమర్పించి ఎన్‌వోసీ పొందాలి. ఇంకా రోడ్లు, భవనాల శాఖ, సంబంధిత పోలీస్ స్టేషన్ నుంచి కూడా ఎన్‌వోసీ తీసుకోవాలి. అన్నీ ఎన్‌వోసీలను ఆన్‌లైన్‌లో నమోదుచేసిన రిజిస్ట్రేషన్ ఫారానికి జత చేసి నగర పోలీస్ కమిషనరేట్‌లో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన సెల్‌లో అందజేయాలి. అన్ని పత్రాలు సక్రమంగా ఉంటే దరఖాస్తును సంబంధిత పోలీస్ స్టేషన్‌కు పంపిస్తారు. అక్కడ అనుమతి మంజూరుచేస్తూ మండపం ఏర్పాటుకు సర్టిఫికెట్ ఇస్తారు. దీనిపై క్యూఆర్ కోడ్ ఉండేలా చర్యలు తీసుకున్నారు. మండపం కొనసాగించే రోజుల్లో ఎవరైనా తనిఖీ చేసినప్పుడు ఆ సర్టిఫికెట్‌పై ఉన్న క్యూ ఆర్ కోడ్‌పై స్కాన్ చేస్తే సరిపోతుందని సంబంధిత వర్గాలు తెలిపాయి.


78 మందికి జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు - 7లో

ఉక్కుకు బొగ్గు కొరత

రోజుకు 14,000 టన్నులు అవసరం

ప్రస్తుతం ప్లాంటులో ఉన్నది కేవలం 5,500 టన్నులు

- కోక్ ఓవెన్ బ్యాటరీలలో పుషింగ్‌ల తగ్గింపు
- గ్యాస్ కొరతతో బ్లాస్ట్ ఫర్నేస్‌లకూ ఇబ్బంది
- గంగవరం, విశాఖ పోర్టుల్లో ఉండిపోయిన విదేశాల నుంచి తెప్పించిన లక్షల టన్నుల బొగ్గు
- బకాయిలు చెల్లించకపోవడంతో ప్లాంటుకు తెచ్చుకోలేని పరిస్థితి
- అత్యవసరంగా బయట కొనుగోలు చేయాల్సిన పరిస్థితి
- యాజమాన్యం ఉక్కిరిబిక్కిరి



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం స్టీల్‌ప్లాంటుకు మళ్లీ బొగ్గు కొరత ఏర్పడింది. 'అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని' అనే పరిస్థితి వచ్చింది. విదేశాల నుంచి తెప్పించుకున్న బొగ్గు గంగవరం పోర్టులో 1.54 లక్షల టన్నులు ఉంది. అలాగే విశాఖపట్నం పోర్టులో 89 వేల టన్నులు ఉంది. ఈ రెండింటిపైనా కోర్టు అటాచ్‌మెంట్లు ఉన్నాయి. తమ బకాయిలు చెల్లించలేదని ప్రైవేటు పార్టీలు కోర్టును ఆశ్రయించడంతో ఆ బొగ్గును డెలివరీ చేయవద్దని కోర్టు ఆదేశించింది. ఈ పరిస్థితి గత ఇరవై రోజులుగా ఉంది. గంగవరం పోర్టులో బొగ్గు విడుదల కోసం యాజమాన్యం ఇటీవల రూ.154 కోట్లు చెల్లించింది. మిగిలిన రూ.45 కోట్లకు స్టీల్ ఇస్తామని హామీ ఇచ్చింది. దాంతో సదరు పార్టీ ఈ విషయాన్ని హైకోర్టుకు విన్నవించి, అటాచ్‌మెంట్ రద్దు చేయాలని కోరింది. ఈ నెల 9వ తేదీ (సోమవారం)న దీనిపై సానుకులంగా ఆదేశాలు వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు. మరోవైపు విశాఖపట్నం పోర్టులో 89 వేల టన్నుల బొగ్గు ఉంది. అక్కడ కూడా ఓ పార్టీ కోర్టు అటాచ్‌మెంట్ తేవడంతో అది కూడా ఆగిపోయిందని ఉద్యోగ వర్గాల సమాచారం. ప్లాంటులో బుధవారం సాయంత్రానికి 5,500 టన్నుల బొగ్గు మాత్రమే ఉంది. దాంతో అత్యవసరంగా బయట కొనుగోలు చేయాలని నిర్ణయించారు. ఎంత కొంటారు?, ఎన్ని రోజులు వస్తుంది?...అనేది చెప్పలేని పరిస్థితి.

తగ్గిపోతున్న పుషింగులు

బొగ్గుతో ప్లాంటులో కోక్ ఓవెన్ బ్యాటరీల ద్వారా కోక్ తయారుచేస్తారు. 35 కిలోల బొగ్గును మండిస్తే 25 కిలోల కోక్ వస్తుంది. దాంతో పాటు గ్యాస్‌లు ఉత్పత్తి అవుతాయి. వాటితో బ్లాస్ట్ ఫర్నేసులు నడుపుతారు. మొత్తం ఐదు కోక్ ఓవెన్ బ్యాటరీలు ఉండగా వాటిని 16 గంటలు చార్జింగ్ చేసిన తరువాత ప్రతి 15 నిమిషాలకు ఒక పుషింగ్ తీస్తారు. అలా రోజుకు 400 వరకు పుషింగులు తీస్తారు. దీనికి రోజుకు 14వేల టన్నుల బొగ్గు అవసరం. అందుకు తగ్గట్టుగా బొగ్గు అందుబాటులో లేకపోవడంతో పుషింగుల సంఖ్య క్రమంగా తగ్గిపోతోంది. రోజుకు 400 పుషింగులు రావలసి ఉండగా సోమవారం 180, బుధవారం నాటికి 165కి తగ్గిపోయాయి. గురువారం 150 మాత్రమే తీస్తారని చెబుతున్నారు. ఈ పుషింగుల ద్వారా వచ్చే కోక్ తగ్గిపోతే బ్లాస్ ఫర్నేసుల్లో స్టీల్ ఉత్పత్తి కూడా పడిపోతుంది. రోజుకు 21 వేల టన్నుల స్టీల్ ఉత్పత్తి ... మిగతా 6వ పేజీలో

ఉక్కు పరిరక్షణకు 10న రాస్తోరోకో

- ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం
- పోరాట కమిటీ నాయకుల ప్రకటన

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 4: విశాఖ స్టీల్‌ప్లాంటు పరిరక్షణకు చేస్తున్న ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. స్టీల్ ప్లాంటు సీఐటీయూ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ నెల పదో తేదీన రాష్ట్రవ్యాప్త రాస్తోరోకో కార్యక్రమంలో భాగంగా కూర్మన్నపాలెం జంక్షన్ వద్ద ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు భారీఎత్తున రాస్తోరోకో చేస్తామన్నారు. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఆరోజు ప్లాంటు ఉద్యో గులు, కాంట్రాక్టు కార్మికులు నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరు కావాలన్నారు. ప్లాంటు పరిరక్షణకు చేపట్టిన పోరాటానికి ఉక్కు నిర్వాసితులు, స్థానికులు మద్దతు పలకాలని కోరారు.

సమావేశంలో పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, కేఎస్ఎన్ రావు, వరసాల శ్రీనివాసరావు, కారు రమణ, నీరుకొండ రామచంద్రరావు, జె.అయోధ్యరామ్,వై.టి.దాసు, రామస్వామి, విళ్ల రామ్మోహన్‌కుమార్, జె.రామకృష్ణ, జి.గణపతిరెడ్డి, మహాలక్ష్మినాయుడు పాల్గొన్నారు.

ఎర్రమట్టి దిబ్బల రక్షణకు గోడ

పశ్చిమ, ఉత్తర దిశలలో నిర్మించాలని జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా సూచన

- భౌగోళిక వారసత్వ సంపద పరిరక్షణ బాధ్యత పర్యాటక శాఖకు అప్పగింత
- ఆక్రమణలపై త్వరలో నివేదిక
- మళ్లీ సర్వే చేయాలని కోరుతున్న భీమిలి బిల్డింగ్ సొసైటీ



విశాఖపట్నం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): **భీమిలి మండలం నేరేళ్లవలస రెవెన్యూ పరిధిలో గల ఎర్రమట్టి దిబ్బల పరిరక్షణ బాధ్యతను రాష్ట్ర పర్యాటక శాఖకు జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ) అప్పగించింది. గత నెలలో జీఎస్ఐ, రెవెన్యూ, గనులు, పర్యాటక శాఖలు సంయుక్తంగా ఎర్రమట్టి దిబ్బలు ఉన్న ప్రాంతాన్ని సర్వే చేసి సరిహద్దులను నిర్ధారించారు. ఎర్రమట్టి దిబ్బల విస్తీర్ణం ఎంత?, ప్రస్తుతం ఆక్రమణకు గురైంది ఎంత అన్న వివరాలను త్వరలో జీఎస్ఐ విడుదల చేయనున్నది.**

దేశంలో అత్యంత అరుదైన ఎర్రమట్టి దిబ్బల చుట్టూ ఆక్రమణలు పెరిగిపోయాయి. భీమునిపట్నం మ్యూచువల్ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీకి ప్రభుత్వం ఇచ్చిన 373.95 ఎకరాల్లో 90 ఎకరాలు ఎర్రమట్టి దిబ్బల ప్రాంతమే. ఆ స్థలంలో గత నెల సొసైటీ లేఅవుట్ అభివృద్ధి చేపట్టడంతో ఈ విషయం వెలుగుచూసింది. దీంతో ఎర్రమట్టి దిబ్బల సరిహద్దులు నిర్ధారించాలని జీఎస్ఐకు జిల్లా కలెక్టర్ లేఖ రాశారు. భీమిలికి నాలుగు కిలోమీటర్ల దూరంలో నైరుతి దిశగా సముద్ర మట్టానికి 10 నుంచి 90 మీటర్ల ఎత్తులో తూర్పు, పడమరలో రెండు కిలోమీటర్లు, ఉత్తర, దక్షిణంలో కిలోమీటరు విస్తీర్ణంలో అంటే 17.51'55' నుంచి 17.52'46' ఉత్తర అంక్షాంశంగా, 83.24'29' నుంచి 86.26'39' తూర్పు రేఖాంశంగా ఉన్న ఎర్రమట్టి దిబ్బలను భౌగోళిక వారసత్వ సంపదగా జీఎస్ఐ 2014లో గుర్తించింది. ఈ మేరకు విడుదల చేసిన నోటిఫికేషన్‌కు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం 2016లో గజిట్ విడుదల చేసింది. అయితే ఎర్రమట్టి దిబ్బల పరిరక్షణకు ఆ తరువాత అటు జీఎస్ఐ గానీ, రాష్ట్ర ప్రభుత్వం గానీ ఎటువంటి చర్యలు తీసుకోలేదు. గత ప్రభుత్వ హయాంలో ఇష్టానుసారంగా ఎర్రమట్టి దిబ్బల్లో మట్టి తవ్వేశారు. అయినా రెవెన్యూ, పంచాయతీ, గనుల శాఖలు మొద్దనిద్రలో ఉండిపోయాయి. పర్యావరణ వేత్తలు అనేక పర్యాయాలు హెచ్చరించడం, చివరకు ఎన్జీటీకి ఫిర్యాదు చేయడం, ఈలోగా భీమిలి బిల్డింగ్ సొసైటీ తవ్వకాలు చేపట్టడంతో ఎర్రమట్టి దిబ్బలు వ్యవహారం తెరపైకి వచ్చింది. చివరకు సర్వే నిర్వహించిన జీఎస్ఐ ఎర్రమట్టి దిబ్బలకు పశ్చిమ, ఉత్తర దిశలలో ప్రహరీ నిర్మించి పరిరక్షించుకోవాలని పర్యాటక శాఖకు సూచించింది. తూర్పున బీచ్‌రోడ్డు, దక్షిణాన ఐఎన్ఎస్ కళింగ ప్రహరీ ఉన్నందున మిగిలిన దిక్కుల్లో గోడ నిర్మించాలని జీఎస్ఐ అధికారులు సూచించారు.

మళ్లీ సర్వే చేయండి..

ఎర్రమట్టి దిబ్బల సరిహద్దులను మరోసారి సర్వే చేసి నిర్ధారించాలని భీమిలి మ్యూచ్యువల్ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ రెండు రోజుల క్రితం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసింది. గతనెలలో సర్వే నిర్వహించినప్పుడు సొసైటీ ప్రతినిధులు కూడా హాజరయ్యారు. అయినా ఇప్పుడు మళ్లీ సర్వే చేయాలని కోరడం గమనార్హం.

గ్రేటర్ టెండర్లపై నేతల కన్ను

చికెన్ వ్యర్థాల సేకరణ, డంపింగ్ యార్డుకు తరలింపు కోసం టెండర్లు పిలిచిన జీవీఎంసీ



- ఎనిమిది జోన్లుగా విభజన
- మొత్తం రూ.1.57 కోట్ల అంచనా
- ఆ కాంట్రాక్టు తాము చెప్పిన వారికి ఇవ్వాలంటూ అధికారులపై కూటమి నేతల ఒత్తిడి
- చికెన్ వ్యర్థాలను యార్డుకు తరలించకుండా చేపల చెరువుల పెంపకందారులకు విక్రయిస్తున్న కాంట్రాక్టర్లు
- బాగా గిట్టుబాటు అవుతుండడంతో టెండర్‌లకు పెరిగిన పోటీ

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

చికెన్ వ్యర్థాల టెండర్లపై నేతల కన్నుపడింది. నగరంలో చికెన్ వ్యర్థాలను దుకాణాల నుంచి సేకరించి కాపులుప్పాడలోని యార్డుకు తరలించే కాంట్రాక్టులను తాము చెప్పిన వారికి దక్కేలా చూడాలంటూ జీవీఎంసీ అధికారులపై పలువురు ఒత్తిడి తెస్తున్నారు. అందుకు అవసరమైతే ఎంతో కొంత తమవారే ఇస్తారంటూ ప్రలోభపెట్టేందుకు యత్నిస్తున్నారు.

నగర పరిధిలోని చికెన్/మటన్ దుకాణాల నుంచి ఉత్పత్తి అయ్యే వ్యర్థాలను ఆరు బయటపడేస్తే ప్రజలను రోగాలు చుట్టుముట్టే ప్రమాదం ఉంటుంది. అందువల్ల జీవీఎంసీ అధికారులు ఆయా దుకాణాల నుంచి ప్రతిరోజూ వ్యర్థాలను వాహనాల ద్వారా సేకరించి కాపులుప్పాడలోని డంపింగ్ యార్డుకు తరలించేవారు. అక్కడ శాస్త్రీయ విధానంలో వాటిని భూమిలో కప్పిపెట్టేవారు. ఇది జీవీఎంసీ అధికారులకు తలనొప్పిగా మారడంతో చికెన్ వ్యర్థాలను సేకరించే బాధ్యతను గత కొన్నేళ్లుగా ప్రైవేటు వ్యక్తులకు టెండర్ ద్వారా అప్పగిస్తూ వస్తోంది. జీవీఎంసీ పరిధిలో రెండేసి జోన్లను ఒక యూనిట్‌గా తీసుకుని ఆయా ప్రాంతాల్లో చికెన్ దుకాణాల నుంచి ప్రతిరోజూ వ్యర్థాలను సేకరించి, వారి సొంత వాహనాల్లో కాపులుప్పాడలోని డంపింగ్ యార్డుకు తరలించేందుకు ఆసక్తి ఉన్న కాంట్రాక్టర్ల నుంచి బాక్సు టెండర్లు పిలుస్తోంది. ఎవరు తక్కువ మొత్తానికి బిడ్ వేస్తారో వారికి కాంట్రాక్ట్ అప్పగించేది. అయితే నగర శివారు ప్రాంతాలతోపాటు అనకాపల్లి, తూర్పుగోదావరి జిల్లాల్లో చేపల చెరువులు సాగు పెరగడంతో చికెన్ వ్యర్థాలకు డిమాండ్ పెరిగింది. చికెన్ వ్యర్థాలను ఉడకబెట్టి చేపలకు వేస్తే వేగంగా పెరుగుతాయని పెంపకందారులు భావిస్తుంటారు. ఇదే అదనుగా నగరంలో చికెన్ వ్యర్థాలను సేకరించి, కాపులుప్పాడలోని ... మిగతా 6వ పేజీలో

బే వాచ్ ఇష్టారాజ్యం

రూమ్‌లు నిర్మించి అడ్డగోలుగా వసూళ్లు

- సముద్రం పక్కన స్థలం ఆక్రమణ
- ఏపీటీడీసీ నిబంధనలకు తిలోదకాలు



బేవాచ్ ఆవరణ

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

పర్యాటక శాఖకు చెందిన ఆస్తులను కొందరు వైసీపీ నేతలు అక్రమార్జనకు అడ్డాగా మార్చుకున్నారు. గత ఐదేళ్లు ఇష్టానుసారంగా వ్యవహరించిన వారు ఇప్పుడు అదే పంథాలో వెళుతున్నారు. భీమిలి బీచ్‌రోడ్డులో తొట్లకొండకు ఎదురుగా బీచ్‌లో ఏపీటీడీసీ రెస్టారెంట్ (బే వాచ్) నిర్మించింది. దానిని లీజుకు ఇచ్చింది. గత ప్రభుత్వంలో రాజకీయ పలుకుబడిని ఉపయోగించి వైసీపీ నాయకులు చాలా స్వల్ప మొత్తానికే దానిని చేజిక్కించుకున్నారు. ఏపీటీడీసీ వారికి రెండు ఎకరాల స్థలంలో గడ్డితో పైకప్పు వేసిన రెస్టారెంట్లు, చిల్డ్రన్ ప్లే ఏరియా మాత్రమే అప్పగించింది. వాటిని ఆపరేట్ చేస్తూ ఆదాయం పొందాలి. సంస్థకు లీజు కట్టాలి. కానీ వైసీపీ నాయకులు ఆ ప్రాంతం మొత్తం ఆక్రమించారు. అది కోస్తా నియంత్రణ మండలి పరిధిలోని ప్రాంతం. సిమెంట్ నిర్మాణాలు చేపట్టకూడదు. కానీ వారు కొత్తగా అతిథి గృహాలు నిర్మించి, ఒక్కో రూమ్ రోజుకు రూ.4 వేలు చొప్పున అద్దెకు ఇచ్చి ఆదాయం పొందుతున్నారు. పిల్లలు క్రికెట్ ఆడడానికి కొత్తగా నిర్మాణం చేపట్టారు. బీచ్ వైపు స్థలాన్ని ఆక్రమించి కాంక్రీట్ నిర్మాణాలు చేపట్టారు. వాస్తవానికి ఇవేమీ వారు చేయడానికి వీల్లేదు. ఏపీటీడీసీ ఇచ్చినవే నిర్వహించాలి. వారికి నచ్చినట్టు చేసుకుంటూ పోతున్నా అప్పుడు అధికార పార్టీకి చెందిన వారు కావడంతో ఏమీ చేయలేకపోయారు. సదరు నిర్వాహకులు పార్టీ పెద్దలను మెప్పించడానికి రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి ఇక్కడ పార్టీ ఇన్‌చార్జిగా ఉన్నప్పుడు ఆయన పుట్టినరోజు వేడుకలను ఇదే బేవాచ్ రిసార్ట్‌లో ఘనంగా నిర్వహించి ఆయన మెప్పు పొందారు. దాంతో అధికారులు అటు వైపు కన్నెత్తి చూసే అవకాశం లేకుండా పోయింది.

మద్యం దుకాణం నిర్వహణ

వైసీపీ ప్రభుత్వంలో అన్ని చోట్ల ప్రభుత్వమే మద్యం విక్రయించింది. పర్యాటక శాఖ అతిథి గృహాల్లో వారికి తక్కువ ధరకు లైసెన్స్ ఇచ్చి మద్యం విక్రయించడానికి అనుమతి ఇచ్చారు. ఆ విధంగా బే వాచ్‌లో ఏపీటీడీసీ అనుమతి తీసుకుంది. కానీ దానిని ప్రైవేటు వ్యక్తులు హస్తగతం చేసుకొని ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారు.

ఫిర్యాదుతో కదిలిన అధికారులు

వైసీపీ నాయకుల అరాచకాలపై వరుసగా ఫిర్యాదులు చేస్తున్న జనసేన నాయకుడు పీతల మూర్తియాదవ్ ఈ రిసార్ట్‌పై కూడా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేసి నివేదిక ఇవ్వాలని పర్యాటక శాఖ అధికారులను ఆదేశించారు. వారు ఏమని నివేదిస్తారో, వారికి కళ్లకు ఈ అక్రమాలు కనిపిస్తాయో లేదో చూడాలి మరి.

రైఫిల్ షూటింగ్‌లో సాయి కౌశిక్‌కు పతకం


సాయికౌశిక్

విశాఖపట్నం (స్పోర్ట్సు), సెప్టెంబరు 4: రాష్ట్ర స్థాయి రైఫిల్ షూటింగ్ చాంపియన్‌షిప్ టోర్నీలో నగరానికి చెందిన సాయికౌశిక్ ప్రతిభ చూపి పతకం సొంతం చేసుకున్నాడు. హైదరాబాద్‌లో జరిగిన ఈ టోర్నీలో 50మీ. రైఫిల్ ప్రోన్ ఈవెంట్‌లో రజత పతకం కైవసం చేసుకుని చెన్నైలో జరగనున్న దక్షిణ భారత రైఫిల్ షూటింగ్ పోటీలలో ఆంధ్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించేందుకు అర్హత సాధించాడు. ఇప్పటికే అనేక జాతీయ,రాష్ట్ర స్థాయి టోర్నీల్లో ప్రతిభ చూపిన సాయికౌశిక్.. సౌత్‌జోన్ టోర్నీలోనూ రాష్ట్రానికి పతకం అందిస్తాడని పలువురు ఆకాంక్షించారు.

నిత్యావసరాల ధరలు తగ్గించాలి: సీపీఐ


నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 3: ప్రభుత్వాలు డీజిల్, పెట్రోల్, వంట గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించి ప్రజలకు ఆహార భద్రత కల్పించాలని సీపీఐ నాయకుడు జి. వామనమూర్తి డిమాండ్ చేశారు. రైల్వేస్టేషన్ ప్రధాన ద్వారం ఎదుట బుధవారం ఈ మేరకు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ ఎన్నికల్లో గెలుపొందిన 100 రోజుల్లోనే నిత్యావసర వస్తువుల ధరలు తగ్గిస్తామని ప్రకటించారన్నారు. ఏడాదికి రెండు కోట్ల మందికి ప్రభుత్వోద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చి పదేళ్లు దాటినా ఇవేవీ అమలుకాలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజేష్, నాగరాజు, ఆంజనేయులు, వై.వెంకట్, రావి కృష్ణ, హెచ్ శేఖర్, గణేష్‌కుమార్, శ్రీను, అప్పలరాజు, గంగరాజు పాల్గొన్నారు.

7 నుంచి దుర్గాగణపతి ఆలయంలో ఉత్సవాలు


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఈవో రామభాయి, కార్పొరేటర్ గోవింద్

సీతంపేట, సెప్టెంబరు 4: నగరంలో ప్రసిద్ధి చెందిన సీతంపేట దుర్గాగణపతి ఆలయంలో వినాయక చవితి ఉత్సవాలను ఈ నెల 7వ తేదీ నుంచి నిర్వహించనున్నట్టు ఆలయ ఈఓ రమాభాయి, వార్డు కార్పొరేటర్, ఉత్సవ కమిటీ చైర్మన్ సారిపిల్లి గోవింద్ తెలిపారు. ఆలయంలో ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను భక్తులు, అర్చకులు నటరాజన్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గోవింద్ మాట్లాడుతూ ఈ నెల 7న దుర్గాగణపతి నిజరూపంలో బంగారు వెండి అభరణాలతో భక్తులకు దర్శనమిస్తారన్నారు. అనంతరం రోజుకో రూపంలో దర్శనమిస్తారన్నారు.

మట్టి విగ్రహాలు పంపిణీ

అల్లిపురం, సెప్టెంబరు 4: పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి వినాయక విగ్రహాలను వినియోగించాలని జనసేన నాయకుడు, 32వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు కోరారు. అల్లిపురం వద్దనున్న పార్టీ కార్యాలయంలో స్థానికులకు మట్టి విగ్రహాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నలినీదేవి, కేదార్నాథ్, బద్రీనాథ్, రమేష్, ఆదిబాబు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలి

» ఎమ్మెల్యే, ఫ్లోర్ లీడర్ విష్ణుకుమార్ రాజు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు. వేదికపై ఎంపీ పురందేశ్వరి

సీతమ్మధార, సెప్టెంబరు 4: బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు, వార్డు అధ్యక్షులు విజయవంతం చేయాలని ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే, ఫ్లోర్ లీడర్ విష్ణుకుమార్ రాజు పేర్కొన్నారు. సీతమ్మధారలోని కేవీఎస్‌ఆర్ ఫంక్షన్ హాలులో ఆయన ఆధ్వర్యంలో పార్టీ సభ్యత్వ నమోదుపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ ఫోన్: 88000 02024 మిస్స్‌డ్ కాల్ ఇచ్చి సభ్యత్వ నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు ఎంతగానో సహకారమందిస్తుందన్నారు. అమరావతి, పోలవరం, స్టీల్‌ప్లాంట్ విషయంలో న్యాయం జరిగేలా ముందుకు సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సురేష్ బాబు, కాశీ విశ్వనాథరాజు, రవీంద్రరెడ్డి, నాగేంద్ర, గంకల గౌత, పృథ్వీరాజ్, పుట్టి గంగయ్య, బుద్ధ లక్ష్మీనారాయణ, కేశవ కాంత్, అప్పలకొండ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

27వ వార్డులో..

అక్కయ్యపాలెం: గ్రేటర్ 27వ వార్డు దొండపర్తిలో బీజేపీ దక్షిణ నియోజకవర్గ కో కన్వీనర్ కారాల మహేష్ ఆధ్వర్యంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పార్వతీపురం జిల్లా ఇన్‌చార్జి ఎన్వీఎస్ ప్రకాష్ రెడ్డి బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో శ్రీకాకుళం ఇన్‌చార్జి విజయానందరెడ్డి, నాయకులు అత్తిలి శంకరరావు, నాయకులు డి.నారాయణరెడ్డి, సత్యనారాయణ, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు రూ. లక్ష విరాళం


ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజుకి చెక్కును అందచేస్తున్న దాతలు

సీతమ్మధార, సెప్టెంబరు 4: విజయవాడ వరదల్లో బాధితుల సహాయార్థం సీఎం రిలీఫ్ ఫండ్‌కి రూ. లక్ష మారికవలసలో ఉన్న హిమాద్రి ఐస్ ప్లాంట్ యజమాని, సీతమ్మధార డాక్టర్స్ కాలనీకి చెందిన దాట్ల వెంకటరామరాజు అందించారు. సీతమ్మధారలోని బీజేపీ కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజుకి ఈ చెక్కు అందించారు. డీఎస్‌పీ వర్మ, వెంకట రామరాజు పాల్గొన్నారు.

చారిటీ బాక్స్ సంస్థ ఆర్థిక సాయం

మహారాణిపేట: విజయవాడ వరద బాధితుల కోసం చారిటీ బాక్స్ స్వచ్ఛంద సంస్థ ఆర్థిక సహాయం అందజేసింది. వర్షాలతో నిరాశ్రయులైన వారికి భోజనాలను సమకూర్చుతున్న అక్షయ పాత్ర సంస్థకు చారిటీ బాక్స్ సంస్థ రూ.11,116 అందించింది. ఈ చెక్కును సంస్థ ప్రతినిధులు వెంకటరమణ, లక్ష్మోజు నూకరాజు శ్రీకాంత్ అక్షయపాత్ర ప్రతినిధి యదురాజును కలసి అందజేశారు.

నేడు కేరళ వామపక్ష ప్రభుత్వం.. ప్రత్యామ్నాయ పాలనపై సదస్సు

డాబాగార్డెన్స్, ఆగస్టు 4: సీపీఎం ఆధ్వర్యంలో ఈ నెల 5న డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో 'కేరళ వామపక్ష ప్రభుత్వం-ప్రత్యామ్నాయ పాలన' అంశంపై సదస్సును నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు తెలిపారు.ఈ సదస్సుకు ముఖ్య వక్తగా కేరళ మాజీమంత్రి డాక్టర్ కెశైలజా టీచర్ హాజరుకానున్నారన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి పోర్టు సహకరించాలి

» చైర్మన్ అంగమత్తుకు ఎమ్మెల్యే వంశీకృష్ణ వినతి


విశాఖ పోర్టు ట్రస్టు చైర్మన్‌కు వినతిపత్రమిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

జగదాంబ కూడలి, సెప్టెంబరు 4: విశాఖ పోర్టు ట్రస్ట్ యాజమాన్యం దక్షిణ నియోజవర్గ అభివృద్ధికి ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు బుధవారం పోర్టు ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ అంగముత్తును కలసి వినతి పత్రం అందజేశారు. విశాఖ పోర్టు కాలుష్యం నుంచి నియోజకవర్గ వాసులను కాపాడేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్.ఎల్. కాలువ ఆధునీకీకరించి, ఇరువైపులా మొక్కలు నాటాలని కోరారు. 34,35,39 వార్డుల్లో సామాజిక భవనాలను నిర్మించాలన్నారు. కేజీహెచ్, ఘోసా సుపత్రుల్లో నూతన భవన నిర్మాణానికి సహకరించాలని కోరారు. ఫిషింగ్‌హార్బర్‌లో ఆక్షన్ భవనం నిర్మించాలని కోరారు. హార్బర్‌లో క్రేన్లు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. గ్రేటర్ 35వ వార్డు లక్ష్మీనగర్‌లో నిర్మించనున్న ఇళ్లకు పోర్టు ట్రస్ట్ ఆర్థికంగా సహకరించాలన్నారు. మహిళలకు కుట్టుమిషన్లు అందించాలని సూచించారు.నెహ్రూ బజార్, జనతాబజార్ ఆధునీకీకరణకు చేయూతందించాలని వివరించారు. ఈమేరకు సహకరిస్తామని పోర్టు చైర్మన్ అంగముత్తు హామీ ఇచ్చారు.

హెల్మెట్ లేని 149 మంది డ్రైవింగ్ లైసెన్స్‌లు సస్పెన్షన్


వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీస్ అధికారులు

మురళీనగర్, సెప్టెంబరు 4; నగర వ్యాప్త తనిఖీల్లో బుధవారం హెల్మెట్ లేకుండా వాహనాలు నడుపుతున్న 149 మంది డ్రైవింగ్ లైసెన్స్‌లు తాత్కాలికంగా రద్దు చేయడంతో మరో 227 మందిపై కేసులు నమోదు చేసినట్టు విశాఖ డిప్యూటీ రవాణా కమిషనరు జి.సి.రాజారత్నం తెలిపారు. ఈ మేరకు సిఫార్సు చేస్తూ పోలీసు అధికారులు తమ కార్యాలయానికి పంపించారని తెలిపారు. ద్విచక్ర వాహనం నడిపే వ్యక్తితోపాటు వెనుక ప్రయాణించేవారికీ హెల్మెట్ తప్పనిసరి అని డీటీసీ ఈ సందర్భంగా పేర్కొన్నారు. లేని పక్షంలో ఇద్దరి డ్రైవింగ్ లైసెన్సులను రద్దు చేస్తామని హెచ్చరించారు. విశాఖ నగరవ్యాప్తంగా రోడ్డు ప్రమాదాలు నియంత్రించేందుకు ఈనెల 1వ తేదీ నుంచి ఈ మేరకు కఠిన నిబంధనలు అమలుచేస్తున్నామన్నారు.

విమానంలో సాంకేతిక సమస్య

మరమ్మతులు చేపట్టాక బయలుదేరిన వైనం

గోపాలపట్నం, సెప్టెంబరు 4: విమానంలో సాంకేతిక సమస్య తలెత్తడంతో టేకాఫ్ జరిగినకాసేపటికే తిరిగి ల్యాండింగ్ అయింది. ఎయిర్‌పోర్టులో బుధవారం ఉదయం విశాఖ నుంచి హైదరాబాద్ వెళ్లేందుకు విమానం బయలుదేరింది. అయితే టేకాఫ్ అయినకాసేపటికే విమానంలో సాంకేతిక సమస్య తలెత్తడంతో పైలట్లు వెంటనే విమానాశ్రయంలోల్యాండింగ్ చేశారు.విమానంలోతలెత్తినసమస్యకుసాంకేతిక నిపుణులు మరమ్మతులు చేపట్టాక గంట ఆలస్యంగా హైదరాబాద్ బయలుదేరి వెళ్లింది.

దారిదోపిడీ కేసులో ఇద్దరి అరెస్టు

కంచరపాలెం, సెప్టెంబరు 4: దారి దోపిడీకు పాల్పడిన ఇద్దరు నిందితులను కంచరపాలెం నేరవిభాగం పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. వివరాలివి.. గత నెల 21తేదీన కాన్వెంటు కూడలి వద్ద బి.మధు అనే వ్యక్తి బస్సు కోసం ఎదురుచూస్తుండగా, అటుగా బైక్‌పై వస్తున్న ముగ్గురు అతనిపై దాడి చేసి సెల్‌ఫోన్, కొంత నగదును అపహరించుకుని వెళ్లిపోయారు. దీంతో బాధితుడు ఫిర్యాదుపై విచారణ చేపట్టి మధురవాడ ప్రాంతానికి చెందిన జి.చైతన్య, శ్రీకాకుళం జిల్లాకు చెందిన గంగు భాస్కరరావును అదుపులోకి తీసుకున్నట్టు సీఐ శ్రీనివాసరావు పేర్కొన్నారు. నిందితులు గతంలో పోర్టులో గ్యాంగ్ పనులు చేస్తున్నట్టు చెప్పారు.

భీమిలి సొసైటీకి రూ.2.83 లక్షల జరిమానా

విశాఖపట్నం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): భీమిలి మండలం నేరేళ్లవలస రెవెన్యూ సర్వే నంబర్ 118/5ఎలో లేఅవుట్ అభివృద్ధి నిమిత్తం అనధికారికంగా 511 క్యూబిక్ మీటర్ల గ్రావెల్ తరలించినందుకు మ్యూచువల్ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీకి రూ.2,83,758 జరిమానా విధిస్తూ గనుల శాఖ డిమాండ్ నోటీస్ జారీచేసింది. లేఅవుట్ అభివృద్ధికి మొత్తం 39,452.512 క్యూబిక్ మీటర్ల గ్రావెల్ వినియోగించారు. ఈ మేరకు గనుల శాఖ గత నెలలో సర్వే చేసి సంబంధిత సొసైటీకి షోకాజ్ జారీచేసింది. దీనిపై సొసైటీ ప్రతినిధులు లేఅవుట్ అభివృద్ధి కోసం ఆనందపురం మండలం జగన్నాథపురంలో రామరాజు అనే వ్యక్తికి చెందిన క్వారీ నుంచి 38,943 క్యూబిక్ మీటర్ల గ్రావెల్ కొనుగోలు చేసినట్టు బిల్లులు సమర్పించారు. క్యూబిక్ మీటరుకు రూ.106 వంతున జగన్నాథపురం క్వారీ యజమాని ప్రభుత్వానికి చెల్లించిన తాత్కాలిక పర్మిట్ల కాపీలను అందజేశారు. గనుల శాఖ ఇచ్చిన షోకాజ్‌లో పేర్కొన్న 39,452 క్యూబిక్ మీటర్లలో 38,943 క్యూబిక్ మీటర్లకు బిల్లులు ఉండడంతో మిగిలిన 511 క్యూబిక్ మీటర్ల గ్రావెల్ అనధికారికంగా తరలించారని తేల్చింది. అందుకు రూ.2,83,758 చెల్లించాలని డిమాండ్ నోటీస్ సొసైటీకి పంపినట్టు జిల్లా గనుల శాఖ అధికారి డీవీఈఎస్‌ఎస్ రాజు తెలిపారు.

ఎమ్మెల్యేని మర్యాదపూర్వకంగా కలిసిన జెడ్సీ

మాధవధార, సెప్టెంబరు 4 ; జీవీఎంసీ జోన్-5 జోనల్ కమిషనర్‌గా బి.రాము బుధవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన శాసన సభ్యులు పి. విష్ణుకుమార్‌రాజుని మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు. అనంతరం జోన్ పరిధిలోని పలు అంశాలపై ఎమ్మెల్యేతో చర్చించారు.





7 నుంచి లక్ష్మీ గణేశ్ దేవస్థానంలో ఉత్సవాలు

విశాఖపట్నం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రైల్వే న్యూకాలనీలోని శ్రీలక్ష్మీ గణేశ్ దేవస్థానంలో ఈ నెల 7వ తేదీ నుంచి 16వ తేదీ వరకు వినాయ చవితి మహోత్సవాలు నిర్వహించనున్నట్టు ఈఓ సురేశ్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో వాటర్ ప్రూఫ్ పెండాళ్లు వేసి పూలు, విద్యుద్దీపాలతో అలంకరిస్తామన్నారు. మహా అన్నదానం చేస్తామన్నారు. రోజూ సాంస్కృతి కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఈ పనులు నిర్వహణకు ఆసక్తి కలిగినవారు ఈనెల 6వతేదీ ఉదయం 10 గంటలలోగా సీల్డ్ కొటేషన్లతో దేవస్థానం వద్ద హాజరు కావాలని సూచించారు.

మాదక ద్రవ్యాల రవాణాపై ప్రత్యేక నిఘా


జ్ఞానాపురం రైల్వే స్టేషన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న సీఐ భాస్కరరావు, సిబ్బంది

కంచరపాలెం, సెప్టెంబరు 4: మాదక ద్రవ్యాల రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేసినట్టు కంచరపాలెం సీఐ ఎస్.భాస్కరరావు తెలిపారు. బుధవారం కంచరపాలెం, జ్ఞానాపురం రైల్వే స్టేషన్ పరిసరాల్లో సిబ్బందితో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. సీఆర్‌పీఎఫ్ సిబ్బంది, స్నిపర్ డాగ్స్‌తో తనిఖీలు చేపట్టారు.ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నగరం నుంచి అన్నీ వైపులా నుంచి గంజాయి, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా నిరోధానికి విస్తృత తనిఖీలు చేపడుతున్నామన్నారు. గంజాయి రవాణాపై సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు.

వరద బాధితులకు నేవీ, ఎయిర్‌ఫోర్స్ సహాయం


విజయవాడలో ఆహార పదార్థాలను కిందికి దించుతున్న నేవీ సిబ్బంది

విశాఖపట్నం, సెప్టెంబరు 5 : విజయవాడ వరదబాధిత ప్రాంతాల్లోని వారికి ఇండియన్ ఎయిర్ ఫోర్స్, ఇండియన్ నేవీ హెలీకాప్టర్ల ద్వారా ఆహారం, తాగునీరు, మందులు తదితర వాటిని పంపిణీ చేస్తున్నారు. పౌరసరఫరాల విభాగం ఆధ్వర్యంలో ఈ సేవలందిస్తున్నారు. ఇళ్ల పైకప్పులు, డాబాలు, అపార్టమెంట్లపై ఉన్న నిరాశ్రయులకుహెలీకాప్టర్ల ద్వారా ఆహారం అందజేస్తున్నారు. బుధవారం సాయంత్రం వరకు 58,000 కిలోల ఆహారంతో పాటు మందులు, తాగునీరు అందజేసినట్టు నేవీ, ఎయిర్ ఫోర్సులు ప్రకటించాయి.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం


ఎగ్జిబిషన్‌లో స్టాల్స్‌ని తిలకిస్తున్న ఆచార్య బాలమోహన్‌దాస్

సీతమ్మధార, సెప్టెంబరు 4: విద్యార్థులు చదువుతోపాటు ఆరోగ్యంపై కూడా దృష్టిసారించాలని నాగార్జున యూనివర్సిటీ పూర్వ ఉపకులపతి ఆచార్య బాల మోహన్‌దాస్ పేర్కొన్నారు. డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాలలో జీవశాస్త్రం విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ పోషకాహార వారోత్సవాలను, పోషక పదార్థాల ఎగ్జిబిషన్‌ను ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో యూజీఎస్‌పీజీ కళాశాలలకు ప్రిన్సిపాల్ డాక్టర్ జీఎస్‌కే చక్రవర్తి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ, యూజీ సైన్స్ కో ఆర్డినేటర్ డాక్టర్ డి.దీనబంధు, విభాగాధిపతులు డాక్టర్ ఎం.భారతి, డాక్టర్ ఎస్.శుభ, డాక్టర్ బిశైలజ, డాక్టర్ గీత, కమిటీ సభ్యులు డాక్టర్ డి.మన్మశ్రీ, ఎం సునీత, ఆర్.స్వప్న తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే ప్రీ డయాబెటిక్‌ను అధిగమించవచ్చు

మహారాణిపేట: దేశ వ్యాప్తంగా ప్రీ డయాబెటిక్ కేసులు పెరుగుతున్నాయని ప్రముఖ వైద్య నిపుణులు రోహిణీ పాటిల్ అన్నారు. మంగళవారం జిల్లా పరిషత్ వద్ద ఓ సమావేశమందిరంలో ప్రీ డయాబెటిక్‌పై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అధ్యయనాల ప్రకారం దేశంలో 15 శాతం మంది ప్రీ డయాబెటిక్ తో బాధపడుతున్నారన్నారు. పోషకాహారంతోనే దీనిని అధిగమించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు వైద్యులు పాల్గొన్నారు.

ఘనంగా 'ఐఎన్ఎస్ సుమిత్ర' వార్షికోత్సవం


వార్షికోత్సవంలో పాల్గొన్న అధికారులు, సిబ్బంది

విశాఖపట్నం, సెప్టెంబరు 4: నేవల్ ఆఫ్‌షోర్ పెట్రోల్ వెజల్ నౌక ఐఎన్ఎస్ సుమిత్ర పదో వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగాయి. ఈస్టర్న్ ఫ్లీట్ ఈ ఉత్సవాలు నిర్వహించారు. ఇందులో భాగంగా సముద్రంలో ఐఎన్ఎస్ సుమిత్ర పలు విన్యాసాలు చేసింది. అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

గోపాలపట్నం, సెప్టెంబరు 4: రైలు నుంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన సింహాచలం రైల్వే స్టేషన్‌లో జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలివి.. సింహాచలం రైల్వే స్టేషన్‌లోని రెండవ నంబరు ప్లాట్ ఫారం శివారున ఈ మృత దేహాన్ని బుధవారం ఉదయం గుర్తించిన స్టేషన్ సిబ్బంది రైల్వే పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు వచ్చి పరిశీలించారు. అయితే, మృతుని వద్ద ఎటువంటి ఆధారాలు లభించక పోవడంతో మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించి మార్చురీలో భద్రపరిచారు. కాగా, వేగంగా వెళ్తున్న రైలు నుంచి జారిపడి మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతుని సంబంధీకులు ఎవరైనా ఉంటే సంప్రదించాలని వారు కోరారు.

ప్రత్యేక రైళ్లు కొనసాగింపు

విశాఖపట్నం, సెప్టెంబరు 4: వరుస పండుగల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రయాణికుల సౌకర్యార్థం దువ్వాడ మీదుగా వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తున్న ప్రత్యేక రైళ్లను మరికొన్ని ట్రిప్పులు కొనసాగించనున్నట్టు సీనియర్ డీసీఎం కె. సందీప్ తెలిపారు. వీటిలో కొచువేలి-షాలిమార్ ఎక్స్‌ప్రెస్ (06081) ఈనెల 20 నుంచి నవంబరు 29 వరకు ప్రతి శుక్రవారం సాయంత్రం 4.20 గంటలకు కొచువేలిలోబయలుదేరి మర్నాడురాత్రి 10.52 గంటలకు దువ్వాడ, ఆదివారం మధ్యాహ్నం 1.40 గంటలకు షాలిమార్ చేరుతుంది. తిరిగి ఈ రైలు ఈనెల 23 నుంచి డిసెంబరు 2 వరకు ప్రతి సోమవారం మధ్యాహ్నం 2.20 గంటలకు షాలిమార్‌లో బయలుదేరుతుంది. తిరునెల్వేలి-షాలిమార్ ఎక్స్‌ప్రెస్ (06087) ఈనెల 12 నుంచి నవంబరు 28 వరకు ప్రతి గురువారం తెల్లవారుజాము 1.50 గంటలకు తిరునెల్వేలిలో బయలుదేరి మర్నాడు ఉదయం 4.47కు దువ్వాడ, రాత్రి 9.00 గంటలకు షాలిమార్ చేరుతుంది. తిరిగి ఈనెల 14 నుంచి నవంబరు 30 వరకు ప్రతి శనివారం సాయంత్రం 5.10 గంటలకు షాలిమార్‌లో బయలుదేరుతుంది. కొయంబత్తూరు-బరౌని ఎక్స్‌ప్రెస్ (06059) ఈనెల పది నుంచి నవంబరు 26 వరకు ప్రతి మంగళవారం ఉదయం 11.50 గంటలకు కొయంబత్తూరులో బయలుదేరుతుంది. అలాగే, ఈ ఎక్స్‌ప్రెస్ (06060) ఈనెల 13 నుంచి 29వ తేదీ వరకు ప్రతి శుక్రవారం రాత్రి 11.45 గంటలకు బరౌనిలో బయలుదేరుతుంది. ఎర్నాకులం-పాట్నా ఎక్స్‌ప్రెస్ (06085) ఈనెల 13 నుంచి 29 వరకు ప్రతి శుక్రవారం రాత్రి 11.00 గంటలకు ఎర్నాకులంలో బయలుదేరుతుంది. తిరిగి ఈనెల 16 నుంచి డిసెంబరు 2 వరకు ప్రతి సోమవారం రాత్రి 11.45 గంటలకు పాట్నాలో బయలుదేరుతుంది. కొయంబత్తూర్-ధనబాద్ ఎక్స్‌ప్రెస్ (06063) ఈనెల 13 నుంచి నవంబరు 29 వరకు ప్రతి శుక్రవారం...తిరిగి ఈనెల 16 నుంచి డిసెంబరు రెండు వరకు ప్రతి సోమవారం ఉదయం 6.00 గంటలకు ధనబాద్‌లో బయలుదేరుతుందన్నారు.

నేడు తిరువనంతపురం, షాలిమార్ రైలు రద్దు

జత రేక్ కొరత నేపథ్యంలో వయా విశాఖ మీదుగా తిరువనంతపురం నుంచి షాలిమార్ వెళ్లే ఎక్స్‌ప్రెస్ (22642) రైలును గురువారం రద్దు చేసినట్టు సీనియర్ డీసీఎం తెలిపారు. కాగా విశాఖ-సికింద్రాబాద్ గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్ (12739), సికింద్రాబాద్-విశాఖ గరీబ్‌రథ ఎక్స్‌ప్రెస్ (12740), చెన్నై సెంట్రల్-హౌరా మెయిల్ ఎక్స్‌ప్రెస్ (12840) రైళ్లు బుధవారం (4న) రద్దయ్యాయి.

కవి సమాజ నిర్దేశకుడు

సీతంపేట, సెప్టెంబరు 4: కవిత్వంతో మార్గ నిర్దేశం చేసి నవ సమాజ నిర్మాణానికి బాటలువేసే దీపధారి కవి అని రచయిత డాక్టర్ కేజీ వేణు పేర్కొన్నారు. సీతంపేట రాజేంద్రనగర్‌లో ప్రిజం కళాశాలలో సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో కవి సమ్మేళనాన్ని నిర్వహించారు. సంస్థ అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన ఈసభలో వేణు మాట్లాడుతూ, భావం, భాష రెండింటి సమన్వయమే కవిత్వమన్నారు. కవి తన సంవేదనను స్పష్టంగా వ్యక్తపరిచి పాఠకుడిని ఆలోచింప చేయాలన్నారు. కార్య క్రమంలో డాక్టర్ సూరపనేని విజయ్‌కుమార్, చిన సూర్యానారాయణ, డాక్టర్ కేవీఎస్ మూర్తి, పిళ్లా రమణమూర్తిపాల్గొన్నారు.

ఉక్కుకు బొగ్గు కొరత

... 5వ పేజీ తరువాయి

కావలసి ఉండగా ఇప్పుడు కేవలం 5 వేల టన్నులకు తగ్గిపోయింది.

ప్రయత్నాలు విఫలం

స్టీల్ యాజమాన్యం ముడి పదార్థాల సేకరణకు అన్ని రకాల ప్రయత్నాలు చేస్తోంది. కానీ ఏవీ కలిసి రావడం లేదు. ఒకవైపు బొగ్గు, మరో వైపు ఐరన్‌ఓర్, ఇంకో వైపు విద్యుత్ కొరత వేధిస్తున్నాయి. నిధులు లేకపోవడంతో ఉక్కిరిబిక్కిరి అవుతోంది. ఎన్ఎండీసీ నుంచి రూ.1,500 కోట్లు ఇప్పిస్తామన్నారు. ఇంతవరకూ అవి కూడా రాలేదు. అత్యవసరంగా బ్యాంకులకు రూ.415 కోట్లు చెల్లించాల్సిన పరిస్థితి వచ్చింది. ఆ మొత్తం కట్టకపోతే ఇబ్బందులు వస్తాయని కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖకు తెలియజేశారు. మరోవైపు జీతాలు ఇవ్వడం లేదని ఉద్యోగులు ఆందోళన చేస్తున్నారు. తాజాగా త్రిఫ్ట్ సొసైటీ సొమ్ము రూ.60 కోట్లు వాడేశారంటూ యాజమాన్యానికి వ్యతిరేకంగా కార్మిక సంఘాలు బుధవారం ఆందోళన చేపట్టాయి.

జాతీయ సంపద నాశనం చేయొద్దు

- అయోధ్యరామ్, కన్వీనర్, ఉక్కు పోరాట కమిటీ

విశాఖపట్నం స్టీల్‌ప్లాంటు జాతీయ సంపద. వేల కోట్ల రూపాయల విలువైనది. కేవలం ముడి పదార్థాలు అందుబాటులో లేక నిర్వీర్యం అయిపోతోంది. ఏదైనా నష్టం జరిగితే పూడ్చుకోవడానికి మళ్లీ వందల కోట్ల రూపాయలు ఖర్చు చేయాలి. ఇప్పటికే సిబ్బంది అనేక త్యాగాలు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే ఆదుకోవాలి.

యాజమాన్యం అవాస్తవాల ప్రచారం ఆపాలి

-వరసాల శ్రీనివాసరావు, కార్మిక సంఘ నాయకులు

ప్లాంటు పరిస్థితి చాలా దయనీయంగా ఉంది. సంక్షోభం నుంచి గట్టెక్కించకుండా అది చేస్తాం..ఇది చేస్తాం అంటూ యాజమాన్యం అవాస్తవాలు ప్రచారం చేస్తోంది. అద్భుతాలు చేస్తామనే మాటలు మానేసి ముడి పదార్థాలు సమకూర్చాలి.

గ్రేటర్ టెండర్‌లపై నేతల కన్ను

... 5వ పేజీ తరువాయి

యార్డుకు తరలిస్తామని జీవీఎంసీ నుంచి కాంట్రాక్టు దక్కించుకున్నవారు వాటిని చేపల పెంపకందారులకు అమ్మడం మొదలుపెట్టారు. దీనివల్ల భారీగా ఆదాయం సమకూరుతుండడంతో చికెన్ వ్యర్థాల సేకరణకు పోటీ పెరిగిపోయింది. జీవీఎంసీ నుంచి బిల్లు తీసుకోవడం మానేసి, తిరిగి డబ్బులు కడతామనే పరిస్థితికి కాంట్రాక్టర్లు వచ్చారంటే పరిస్థితి ఏ విధంగా ఉన్నదీ అర్థం చేసుకోవచ్చు. ఇదిలావుండగా గతంలో ఇచ్చిన కాంట్రాక్టు గడువు ముగియడంతో జీవీఎంసీ వ్యర్థాల సేకరణ, తరలింపునకు ఈ-ప్రొక్యూర్‌మెంట్‌లో ఇటీవల రూ.1.57 కోట్ల అంచనాతో టెండర్లు పిలిచింది. ప్రతి జోన్‌ను ఒక వర్క్‌గా విభజించింది. కాంట్రాక్టరే సొంతంగా వాహనంతోపాటు డ్రైవర్, వర్కర్లను సమకూర్చుకోవాలని, సేకరించిన వ్యర్థాలను కాపులుప్పాడలోని యార్డుకు మాత్రమే తరలించాలని, ప్రతిరోజూ కనీసం పది టన్నుల వ్యర్థాలను సేకరించాలని టెండర్‌లో నిబంధన విధించింది. అయినప్పటికీ టెండర్ దక్కించుకునేందుకు చాలామంది పోటీ పడుతున్నట్టు ప్రచారం జరుగుతోంది.

కూటమి నేతలను ఆశ్రయిస్తున్న కాంట్రాక్టర్లు

వ్యర్థాల సేకరణ, తరలింపునకు జీవీఎంసీ పిలిచిన టెండర్లను దక్కించుకునేందుకు ఆసక్తి చూపుతున్నవారంతా తమకు తెలిసిన కూటమి నేతలను ఆశ్రయిస్తున్నారు. ఎలాగైనా తమకు టెండర్ వచ్చేలా చూడాలంటూ కోరుతున్నారు. దీంతో కూటమి నేతలు జీవీఎంసీ అధికారులకు ఫోన్ చేసి చికెన్ వ్యర్థాలకు సంబంధించి తమ పరిధిలోని జోన్ టెండర్ తాను చెప్పిన వ్యక్తికి దక్కేలా చూడాలంటూ ఆదేశిస్తున్నారు. ఎవరైనా టెండర్ వేసినా వారిని ఏదోలా అనర్హులుగా తేల్చేయాలని సూచిస్తున్నారు. కూటమికి చెందిన ఒక నేతతోపాటు ముగ్గురు ప్రజా ప్రతినిధులు జీవీఎంసీ అధికారులకు ఫోన్ చేసి తమ వారికి టెండర్ వచ్చేలా చూడాలని ఆదేశించినట్టు తెలిసింది. అలాగే వైసీపీ నేతలు కొందరు తమతో బాగా పరిచయం కలిగిన కూటమి ప్రజా ప్రతినిధుల ద్వారా తమ అస్మదీయులకు టెండర్ ఇప్పించుకునేందుకు యత్నిస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఇదిలావుండగా చికెన్ వ్యర్థాలతో పెరిగిన చేపలను తింటే క్యాన్సర్‌తోపాటు జీర్ణకోశ సంబంధిత రోగాలు చుట్టుముడతాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకునైనా చికెన్ వ్యర్థాలను చేపల చెరువులకు వెళ్లకుండా అడ్డుకట్ట వేయాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.





అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవో హుస్సేన్ సాహెబ్

ముంపు ప్రాంతాల్లో ఆర్డీవో పర్యటన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గోపాలపట్నం, సెప్టెంబరు 4: కొత్తపాలెం శివారులోని ముంపు ప్రాంతాలను ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ బుధవారం పరిశీలించారు. ఈ నెల రెండున 'ఆంధ్ర జ్యోతి'లో 'ముంపులో కొత్తపాలెం శివారు ప్రాంతం' శీర్షికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ నేపథ్యంలో ఆర్డీవో 88, 89 వార్డుల సరిహద్దులోని ముంపు ప్రాంతాన్ని పరిశీలించారు. ముంపు నివారణకు డ్రైనేజీల నిర్మాణం చేపట్టాలని జీవీఎంసీ అధికారులను ఆదేశించారు. ఇందుకు సంబంధించి భూసేకరణ, తదితర అంశాలపై రెవెన్యూ అధికారులను సమన్వయం చేసుకుని చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్సీ హేమావతి, కార్పొరేటర్ మొల్లి ముత్యాలనాయుడు పాల్గొన్నారు.

గౌరీ సేవా సంఘం నూతన కార్యవర్గం

గాజువాక, సెప్టెంబరు 4: గాజువాక హైస్కూల్ రోడ్డులోని గౌరీ సేవా సంఘం నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షునిగా ఎస్.నారాయణమూర్తి, అధ్యక్షునిగా భీశెట్టి సింహాచలం నాయుడు, ప్రధాన కార్యదర్శిగా చదరం నూకరాజు, కోశాధికారిగా ఆడారి రాము, ఆడిటర్‌గా బి.సత్యనారాయణమూర్తి, ఉపాధ్యక్షులుగా బి.వెంకటేశ్వరరావు, ఎం.నాగేశ్వరరావు, చంద్రరావులతో పాటు పలువురు సభ్యులను ఎన్నుకున్నారు.

మట్టి వినాయక విగ్రహాల పంపిణీ

అక్కిరెడ్డిపాలెం, సెప్టెంబరు 4: మట్టి వినాయకులను పూజించి పర్యావరణాన్ని పరిరక్షించాలని అక్కిరెడ్డిపాలెం స్కూల్ అభివృద్ధి కమిటీ నాయకుడు సంగ్రాన నూకరాజు అన్నారు. అక్కిరెడ్డిపాలెంలో ఇటీవల మృతి చెందిన ఎస్.చైతన్య జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు బుధవారం చేపట్టిన మట్టి వినాయక విగ్రహాల పంపిణీలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్.లక్ష్మీ, గొంతిన సత్యవతి, చంద్రమ్మ, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతపై అవగాహన ర్యాలీ

గాజువాక, సెప్టెంబరు 4: అప్పికొండ చేపలపాలెం ప్రాథమిక పాఠశాలలో బుధవారం స్వచ్ఛతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం కూరపాటి వినోద్‌కుమార్ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతో అన్ని విధాల మేలు చేకూరుతుందన్నారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ, నినాదాలు చేస్తూ ర్యాలీ చేపట్టారు. అనంతరం అప్పికొండ సముద్ర తీరాన్ని శుభ్రపరిచారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి వినతి

అగనంపూడి, సెప్టెంబరు 4: అగనంపూడి, ఉక్కు నిర్వాసిత కాలనీలు, పరిసర ప్రాంతాల్లో గల విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం ఆర్ఈసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి ఎం.శ్యామలకు స్థానిక అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు బి. సత్యనారాయణ వినతిపత్రం అందజేశారు. ముఖ్యంగా లో వోల్టేజీ సమస్య పరిష్కారానికి ఇండోర్ సబ్ స్టేషన్‌ను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు.

పట్టపగలే హైమాస్ట్ లైటు వెలుగులు



ఎన్.ఎ.డి.జంక్షన్, సెప్టెంబరు 4: గ్రేటర్ 90వ వార్డు పరిధి కాకానీనగర్ శివాలయం దాటిన మలుపు వద్దనున్న హైమాస్ట్ విద్యుత్ దీపం పట్టపగలే రెండు రోజులుగా వెలుగుతున్నా సంబంధిత సిబ్బంది పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. ఈ జంక్షన్‌లో ఏర్పాటు చేసిన హైమాస్ట్ విద్యుత్ దీపం ఇటీవల వీచిన గాలులకు ఒకపక్కకు వాలిపోయి పడిపోయాలా ఉందని చెబుతున్నారు. అందువల్ల సంబంధిత అధికారులు స్పందించి విద్యుత్ వృథాను అరికట్టడంతో పాటు స్తంభం పడిపోకుండా తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

సినిమా గైడ్

- **ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్:** మెలోడి, శరత్, శ్రీరామ, శ్రీకన్య, కిన్నెర, శారద, సౌజన్య (గోపాలపట్నం), శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), అరుణ (పెదగంట్యాడ), లిఖిత (శ్రీహరిపురం), లక్ష్మీకాంత్ (గాజువాక).
- **సరిపోదా శనివారం :** జగదాంబ, సంగం, కామేశ్వరి, శ్రీరామ, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), కన్య-1,2 (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)
- **మారుతీనగర్ సుబ్రహ్మణ్యం :** నటరాజ్ (పెందుర్తి), లక్ష్మీకాంత్ (గాజువాక)
- **ఆయ్ :** రమాదేవి, వెంకటేశ్వర-2, శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), హెవెన్-3 (గాజువాక), రాములమ్మ (తగరపువలస)
- **కమిటీ కుర్రోళ్ళు :** శ్రీవెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మోహిని (గాజువాక), నటరాజ్ (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
- **తంగలాన్ :** నటరాజ్ (పెందుర్తి), లక్ష్మీకాంత్ (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 50, టమాటా 28, వంకాయలు (తెలుపు) 32, వంకాయలు (నలుపు) 36, బెండకాయలు 38, పచ్చిమిర్చి 38, కాకరకాయలు 24, బీరకాయలు 36, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 34, క్యాబేజీ 22, క్యారెట్ 32, దొండకాయలు 32, బంగాళదుంపలు 29, అరటికాయ (పెద్దది) 8, అల్లం (పాతది) 110, మునక్కాడలు (కిలో) 42, బరబాటి 40, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 100, గోరుచిక్కుడు 34, దోసకాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 280, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 98, పొటల్స్ 34, కీరదోస 32, కాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 40, చిలగడదుంపలు 48, కంద 54, దేముడుచిక్కుడు 62, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాల కూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 28, మామిడి అల్లం 70, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	505
విజయనగరం	509
శ్రీకాకుళం	509

చికెన్ ధరలు

బ్యాగ్


రైతు ధర	--	91
ఫారం ధర	--	111
విత్ స్కిన్	--	192
స్కిన్‌లెస్	--	202

గురుతర బాధ్యత

సమాజ నిర్దేశకులు ఉపాధ్యాయులు

- తల్లిదండ్రుల తరువాత స్థానం వారిదే
- ఉపాధ్యాయుడిగా పని చేసిన సర్వేపల్లి
- ఏయూతో ఐదేళ్లు అనుబంధం
- 1931 నుంచి 1936 వరకూ వీసీగా సేవలు
- తొలి గౌరవ డాక్టరేట్ గ్రహీత

నేడు ఉపాధ్యాయుల దినోత్సవం



గురువు అంటే ఒక బాధ్యత. సమాజంలో ఏది మంచి, ఏది చెడు, ఎటువైపు నడిస్తే ఏం జరుగుతుందో పిల్లలకు నిర్దేశించడం ద్వారా దేశానికి మంచి పౌరులను అందించడం ఒక్క ఉపాధ్యాయుడే సాధ్యం. ఒక్క ముక్కలో చెప్పాలంటే సమాజ నిర్దేశకుడు గురువు. అందుకే తల్లిదండ్రుల తరువాత స్థానం వారికిచ్చారు. అన్ని వృత్తుల కంటే ఉపాధ్యాయ వృత్తి అత్యంత పవిత్రమైనది. విలువైనది. బాధ్యతతో కూడుకున్నది. జాతిని మేల్కొలపాలంటే ఒక్క గురువుకే సాధ్యం. తల్లిదండ్రులు జన్మనిస్తే.. గురువు బతుకును ఇస్తాడు. దేశ తొలి ఉప రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి పురస్కరించుకుని ఏటా సెప్టెంబరు 5న ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. దేశానికి రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి కాకముందు రాధాకృష్ణన్ ఉపాధ్యాయుడిగా పనిచేశారు. ఆయనకు ఏయూతో ఎంతో అనుబంధం ఉంది. ఇక్కడ ఐదేళ్ల పాటు వీసీగా పని చేయడమే కాకుండా తొలి గౌరవ డాక్టరేట్ అందుకున్నారు.

విశాఖపట్నం/ఆంధ్రజ్యోతి

దేశంలోని పురాతన విశ్వవిద్యాలయాల్లో ఆంధ్ర యూనివర్సిటీ ఒకటి. ఇక్కడ వైస్ చాన్సలర్‌గా సర్వేపల్లి రాధాకృష్ణన్ పని చేశారు. ఉప రాష్ట్రపతి, రాష్ట్రపతి కాకముందు ఆయన కొన్నేళ్ల పాటు ఉపాధ్యాయ వృత్తి చేపట్టారు.వేదాంతిగా, తత్వవేత్తగా, పాలనా దక్షుడిగా కూడా ఆయనకు ఎంతో పేరుంది. తమిళనాడులోని తిరుత్తణిలో 1988 సెప్టెంబరు ఐదో తేదీన జన్మించిన ఆయన అనేక ప్రాంతాల్లో ఉపాధ్యాయుడిగా పని చేశారు. ఈ క్రమంలోనే ఏయూ వైస్ చాన్సలర్‌గా 1931 నుంచి 1936 వరకూ పని చేసి వర్సిటీ అభివృద్ధికి కృషి చేశారు. ఏయూకి రెండో వైస్ చాన్సలర్‌గా ఆయన సేవలందించారు. వీసీ కాకముందు 1927లో వర్సిటీ నిర్వహించిన తొలి స్నాతకోత్సవంలో పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వర్సిటీ గౌరవ డాక్టరేట్‌ను ఆయనకు ప్రదానం చేసింది. ఆ తరువాత కాలంలో ఆయన వీసీగా వచ్చారు. అనంతరం దేశానికి ఉప రాష్ట్రపతిగా, రాష్ట్రపతిగా పనిచేశారు. వీసీగా పనిచేసిన ఐదేళ్లలో ఆయన తీసుకున్న అనేక నిర్ణయాలు వర్సిటీ అభివృద్ధికి దోహదం చేశాయి. ఆయన హయాంలో రవీంద్రనాథ్ ఠాగూర్ ప్రసంగం ఏర్పాటు చేయగా, నోబుల్ బహుమతి గ్రహీత సర్ సీవీ రామన్ హాజరయ్యారు.

ఏయూలో తొలి ప్రసంగం



1927లో ఏయూ స్నాతకోత్సవంలో పాల్గొన్న సర్వేపల్లి రాధాకృష్ణన్ తొలి ప్రసంగం చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆంధ్రులపై పొగడ్తలు వర్షం కురిపించారు. అదృష్టవశాత్తూ ఆంధ్రులమంతా కొన్ని విషయాల్లో స్థిత ప్రజ్ఞులం అంటూ పేర్కొన్నారు. దేశంలోని ఏ ప్రాంతమైనా సమర్థవంతమైన ఐక్యతా భావాన్ని పెంపొందించు కోగులుగుతుందంటే అది ఆంధ్రాలోనే అని తాను నమ్ముతానంటూ పేర్కొన్నారు. మాతృభాషపై ప్రేమ ప్రతి ఒక్కరినీ బంధిస్తుందంటూ వ్యాఖ్యానించారు.

సర్వేపల్లి గొప్ప సంస్కర్త



వర్సిటీలో అనేక సంస్కరణలకు సర్వేపల్లి ఆద్యులు. ఆయనలాంటి గొప్ప వ్యక్తుల మార్గదర్శకత్వంలో వర్సిటీ నేడు ఈస్థాయికి చేరుకుంది. అటువంటి మహోన్నతమైన వ్యక్తుల ఆదర్శాలను ముందుకు తీసుకె ళతూ వందేళ్ల ఉత్సవాలకు సిద్ధమవుతున్నాం. దేశంలోని గొప్ప వర్సిటీల జాబితాలో ఏయూ ఉండాలన్న వారి సంకల్పానికి అనుగుణంగా పని చేస్తున్నాం.

- ప్రస్తుతం వీసీ శశిభూషణరావు

అప్పట్లోనే ఏయూకి గుర్తింపు



సర్వేపల్లి రాధాకృష్ణన్ అప్పట్లోనే ఏయూ భవిష్యత్‌లో గొప్ప స్థానంలో ఉంటుందని ఊహించారు. ఆయన తన ఐదేళ్ల పాలనలో వర్సిటీ అభివృద్ధికి అద్భుతమైన ప్రణాళికలు రూపొందించారు. తొలి పాల కుల ఆశయాలకు అనుగుణంగా వర్సిటీని అభివృద్ధి పథంలో తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నాం. త్వరలోనే వందేళ్ల ఉత్సవాలు నిర్వహిస్తాం.

- ఇఎన్ ధనుంజయరావు, రిజిస్ట్రార్, ప్రొఫెసర్

రూ.60.24 కోట్లను త్రిఫ్ట్ సొసైటీకి జమ చేయాలి

ఉక్కు ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ విభాగం వద్ద ధర్నా చేసిన సొసైటీ ప్రతినిధులు



ధర్నాలో పాల్గొన్న త్రిఫ్ట్ సొసైటీ ప్రతినిధులు, తదితరులు

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 4: స్టీల్ ప్లాంట్ ఉద్యోగుల నుంచి యాజమాన్యం రికవరీ చేసిన రూ.60.24 కోట్లను వెంటనే త్రిఫ్ట్ సొసైటీకి జమ చేయాలని కోరుతూ బుధవారం సొసైటీ పాలకవర్గ ప్రతినిధులు ఉక్కు ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ విభాగం వద్ద ధర్నా చేశారు. ఈ ధర్నాకు పలు కార్మిక సంఘాల నాయకులు మద్దతు పలికారు. ఈ సందర్భంగా సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్యరామ్ మాట్లాడుతూ జిందాల్, టాటా కన్సల్టెన్సీల వద్ద తీసుకున్న సొమ్ముకు వడ్డీతో సహా చెల్లిస్తున్న యాజమాన్యం.. త్రిఫ్ట్ సొసైటీ సభ్యుల నుంచి గత కొన్ని నెలలుగా రికవరీ చేసిన రూ.60.24 కోట్ల బకాయిలను 12 శాతం వడ్డీతో తక్షణమే సొసైటీకి జమ చేయాలని డిమాండ్ చేశారు. రూ.370 కోట్ల టర్నోవర్‌తో 12 వేల మంది సభ్యుల ఆర్థిక అవసరాలను తీరుస్తూ రాష్ట్రంలోనే నంబర్‌వన్‌గా ఉన్న త్రిఫ్ట్ సొసైటీని ఆర్థికంగా దెబ్బతీయాలనే యాజమాన్యం చూస్తూ సహించేది లేదని హెచ్చరించారు. సొసైటీ ఉపాధ్యక్షుడు కె.ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ సభ్యుల ప్రయోజనాలను కాపాడేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి డి.శ్రీరామచంద్రమూర్తి, డైరెక్టర్ కె.శ్రీనివాస్, పలు కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు. అనంతరం డీజీఎం (ఫైనాన్స్) ఎస్.రామప్రసాద్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.

వరద బాధితుల కోసం రూ.5 లక్షల విలువైన రొట్టెల తరలింపు



ఆటోనగర్‌లో వాహనానికి జెండా ఊపిన పారిశ్రామిక వేత్తలు

ఆటోనగర్, సెప్టెంబరు 4: ప్రార్థించే పెదవులు కన్నా సాయం చేసే చేతులు మిన్న అని వాసివా అధ్యక్షుడు సజ్జా పాండురంగ ప్రసాద్ అన్నారు. ఆటోనగర్‌లోని డీ-బ్లాక్ నుంచి బుధవారం వాసివా, ఐలా, పైవాల ఆధ్వర్యంలో పారిశ్రామిక వేత్తలు విజయవాడ వరద బాధితుల సహాయార్థం సుమారు రూ.ఐదు లక్షల విలువైన చేసే 15,000 రొట్టెలు, రెండు వేల కూల్ డ్రింక్ బాటిళ్లు, ఎనిమిది వేల బిస్కట్ ప్యాకెట్లను వాహనంలో తరలించారు. ఈ వాహనానికి జెండా ఊపిన పలువురు పారిశ్రామికవేత్తలు కష్టంలో ఉన్నవారిని ఆదుకునేందుకు స్వచ్ఛంద సంస్థలతో పాటు ప్రజలు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో పారిశ్రామికవేత్తలు రామ్‌ప్రసాద్, యార్లగడ్డ సాంబశివరావు, పరుచూరి ప్రభాకర్, రఘు, చీకటి సత్యనారాయణ, కొల్లి ఈశ్వరరావు, రామభద్రరాజు, డి.శ్రీనివాస్, శేషగిరిరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీబీఎల్ ఆధ్వర్యంలో ఆహారం పంపిణీ

అక్కిరెడ్డిపాలెం: వరదల్లో చిక్కుకున్న విజయవాడలోని సింగ్‌నగర్ ప్రాంత ప్రజలకు ఎస్టీబీఎల్ సిబ్బంది మంగళ, బుధవారాల్లో ఆహారంతో పాటు తాగునీరు, మందులను పంపిణీ చేశారు. సంస్థ చైర్మన్ గుత్తికొండ బాలాజీ వీరభద్రరావు పర్యవేక్షణలో సిబ్బంది సుమారు మూడు వేల ఆహార పొట్లాలు, తాగునీరు, మందులను ప్రజలకు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ అధికారులు పాల్గొన్నారు.



వరద బాధితులకు ఆహారం పంపిణీ చేస్తున్న ఎస్టీబీఎల్ సిబ్బంది

78 మందికి జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు

కలెక్టర్ చేతుల మీదుగా నేడు ప్రదానం

విశాఖపట్నం, సెప్టెంబరు 4: నగరంలోని కొత్త వెంకోజీపాలెంలోని సీఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో గురువారం ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించనున్నట్టు కలెక్టర్ హరేంధిర ప్రసాద్ తెలిపారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడు దల చేశారు. ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణ విగ్రహానికి పూలమాలాంకరణ అనంతరం జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలు ప్రదానం చేస్తామని చెప్పారు. ఈఏడాది 78 మందిని పురస్కారాలకు ఎంపిక చేశామన్నారు. ఎంపికైన వారిలో.. వై. వెంకటేశ్వరరావు (వెల్లంకి), బి. సూర్యప్రకాశరావు (కణితి), కాంతం (అక్కిరెడ్డిపాలెం), చిన్నయ్య (పెందుర్తి), రోజామణి (చిట్టివలస), త్రినాధరావు (గాజువాక మింది), హేమలత (చింతలాగ్రహారం), వినాయకి (ఆనందపురం), వెంకట నరసింగరావు (బర్మాకాలనీ), ప్రభాకర్ (ఆర్‌బీఎం యూపీ స్కూల్), టి. వెంకటలక్ష్మి (పెదగంట్యాడ), కె. లుధీయ (చినగదిలి), సుధామాధవి (చినగదిలి జెడ్పీహెచ్ఎస్), డి. మదుకొండలరావు (చంద్రంపాలెం జెడ్పీహెచ్ఎస్), పైడిరాజు (పద్మనాభం, జెడ్పీహెచ్ఎస్), కె.సూర్యకుమారి (గాజువాక జెడ్పీ హెచ్ఎస్), ఆర్. సత్యవతి (యారాడ జెడ్పీహెచ్ఎస్), ఫాతిమా (గోపాలపట్నం జెడ్పీహెచ్ఎస్), సాయికుమారి (బోయపాలెం జెడ్పీహెచ్ఎస్), కె.గోపినాథ్ (సిర్లపాలెం జెడ్పీహెచ్ఎస్), డి .సత్యనారాయణ (చిట్టివలస జెడ్పీహెచ్ఎస్), కె.మురళీకృష్ణ (చిట్టివలస జెడ్పీహెచ్ఎస్), కె.సుభాష్ బోస్ (అడివివరం జెడ్పీ హెచ్ఎస్), కె.సూర్యకిరణ్ (పెదగంట్యాడ జెడ్పీహెచ్ఎస్), కె. మురళీధర్ (కపరాడ జెడ్పీహెచ్ఎస్), వీవీ నాగేశ్వరరావు (ప్రభుత్వ క్యూఎం హెచ్ఎస్), కె.ఎస్.ఎస్ మోహన్ (ఎంవీడీ హెచ్ఎస్), బి. శివప్రసాద్ (పెందుర్తి ప్రభుత్వ హెచ్ఎస్), పి.వి.రత్నం (గాజువాక జెడ్పీహెచ్ఎస్), నరసింహమూర్తి (ఇస్లాంపేట జెడ్పీహెచ్ఎస్), పి. వెంకటలక్ష్మి (భీమిలి జెడ్పీహెచ్ఎస్), బి.పద్మావతి (చినగదిలి, జెడ్పీహెచ్ఎస్), టి.రామారావు (మల్కాపురం జీవీఎంసీహెచ్ఎస్), జగదీష్ (పెందుర్తి జెడ్పీహెచ్ఎస్), కె.శారద (ఆనందపురం జెడ్పీహెచ్ఎస్), రాజన మంగమ్మ (పెదగంట్యాడ జెడ్పీహెచ్ఎస్), మహాలక్ష్మి (భీమిలి) వై.దయానందరావు (గోపాలపట్నం జెడ్పీహెచ్ఎస్), కె. కృష్ణ (పద్మనాభం జెడ్పీహెచ్ఎస్), ధర్మారావు (అక్కయ్యపాలెం జీవీఎంసీ హెచ్ఎస్), ఉన్నారు. అలాగే ఎన్. ప్రభాకర్ (మధు రవాడ ఎంపీపీఎస్), ఆర్.శ్రీనివాసరావు (గాజువాక ఎంపీపీఎస్), ఎం.ఆశాలత (గాజువాక ఎంపీపీఎస్), సుదర్శన పట్నాయ్ (బాలచెరువు ఎంపీపీఎస్), ఎస్.జగన్నాథరావు (పెందుర్తి ఎంపీపీఎస్), విశ్వనాథం (అక్కయ్యపాలెం జీవీఎంసీ హెచ్ఎస్), కొర్లాపు సుజాత (కేడీపీఎం హెచ్ఎస్), కిరణ్‌కుమార్ (చందాక ఎంపీపీఎస్), ఎం.రమాదేవి (భీమిలి పీఎస్ఎంఈ జీవీఎంసీ స్కూల్), కె.సన్యాసినాయుడు (భీమిలి ఎంపీపీఎస్), జి.ప్రభాకర్ (కోశానివానిపాలెం ఎంపీపీఎస్), వి.యర్రాజీరావు (దిబ్బపాలెం ఎంపీపీఎస్), నాయణ సుజాత (చినగదిలి ఎంపీపీఎస్), బాల (భగవాన్‌దాస్ కాలనీ ఎంపీపీఎస్), ఎల్. అనురాధ (సాయిరాం కాలనీ ఎంపీపీఎస్), బి. కళావతి (గాజువాక ఎంపీపీఎస్), కె.సత్యవతి (బుచ్చిరాజుపాలెం జీవీఎంసీ యూపీఎస్), పి.శ్రీదేవి (కంచరపాలెం జీవీఎంసీ పీఎస్), ఎం. పూర్ణశ్రీనివాస్ (సుభాష్‌నగర్ జీవీఎంసీపీఎస్), జి. మాధురి (సాంకేతపురం జీవీఎంసీపీఎస్), ఆర్.హిమరాణి (మాధవధార జీవీఎంపీ పీఎస్), పి. రమణకుమారి (త్రినాథపురం జీవీఎంసీ పీఎస్), కె.రవికుమార్ (మహారాణిపేట జీవీఎంసీ పీఎస్), జేవీ జయభారతి (ప్రకాశరావుపేట జీవీఎంసీ పీఎస్), సత్యవతి (మల్కాపురం జీవీ ఎంసీపీఎస్), వి.కన్నబాబు (ఎక్స్‌సర్వీస్‌మెన్‌కాలనీ జీవీఎంసీ పీఎస్), శ్రావణి (గోపాలపట్నం జీవీఎంసీ పీఎస్), మోసుగంటి పీర్ (పద్మనాభం ఎంపీపీఎస్), పి. వెంకటరావు (పద్మనాభం ఎంపీ పీఎస్), టి.భాగ్యలత (పెదగంట్యాడ ఎంపీపీఎస్), షేక్ మదీనా బేగం (పెదగంట్యాడ, ఎంపీపీఎస్), టి. సూర్యప్రభావతి (నరవపాలెం ఎంపీపీఎస్), ఎ.రవి ప్రతాప్ (పెందుర్తి ఎంపీయూపీఎస్), ఎస్. సూర్యరావు (పాపాయారాజుపాలెం ఎంపీపీఎస్), చింతాల లలిత (శివాజీపాలెం జీవీఎంసీ పీఎస్), బి. దేముడుబాబు (మధురానగర్ జీవీఎంసీ పీఎస్), మేరీ జోష్‌ఫైన్ (తారకరామ నగర్ ఎంపీపీఎస్), టి. అనిల్‌బాబు జోషి (ప్రభుత్వ క్వీన్‌మేరీ హెచ్ఎస్) ఉన్నారు.

విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం




హెచ్ఎం సూర్యప్రకాశ్‌ను సత్కరించి జ్ఞాపిక అందజేస్తున్న దృశ్యం

కూర్మన్నపాలెం, సెప్టెంబరు 4: విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమైనదని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ అన్నారు. 87వ వార్డు కణితి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయునిగా పనిచేస్తున్న బి.సూర్యప్రకాశ్ ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎన్నికైన సందర్భంగా బుధవారం స్కూల్‌లో నిర్వహించిన అభినందన కార్యక్రమానికి జగన్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లా స్థాయిలో క్రీడా ప్రతిభా అవార్డు, తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయి నృత్య ప్రదర్శనలో కణితి పాఠశాల ప్రథమ స్థానంలో నిలవడంలో సూర్యప్రకాశ్ కృషి ఎంతో ఉంద న్నారు. అనంతరం హెచ్ఎంను జగన్‌తో పాటు ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం.మన్నాజీ, నారాయణరావు, అరుణ, షేక్ ప్రసాద్, శ్రీనివాస్, రామశేషు, నరసింగరావు, తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి చేయూత

అగనంపూడి, సెప్టెంబరు 4: జీవీఎంసీ 85వ వార్డు పరిధి పెదమడకలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన వి.నరసింగరావు కుటుంబాన్ని ఆదుకునేందుకు శ్రీపద్మ మార్కండేయ సేవా సంఘం ముందుకొచ్చింది. ఈ మేరకు బుధవారం వారిని కలిసి నెల రోజులకు సరిపడా నిత్యావసర సరుకులను సంఘం ప్రతినిధులు అందజేశారు. సంఘం అధ్యక్షుడు కొలిపాక అప్పారావు మాట్లాడుతూ ఆదపలో ఉన్న నిరుపేదలను ఆదుకునేందుకు అందరూ ముందుకు రావాలన్నారు. సంఘం ప్రతినిధులు జి.పైడికొండ, బి.హనుమంతరావు, జి.నరసింగరావు, వరలక్ష్మి, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.



జలకళతో ఉన్న పెందుర్తిలోని చెరువు

నిండుకుండల్లా చెరువులు

పెందుర్తి, సెప్టెంబరు 4: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు చెరువులకు జలకళ సంతరించుకొంది. మండలంలో సుమారు 105కు పైగా చెరువులు ఉన్నాయి. వీటిలో 90 శాతానికి పైగా చెరువులు నిండుకుండలను తలపిస్తున్నాయి. పెందుర్తి పాతఊరు, సరిపల్లి, ముదపాక, పినగాడి, రాంపురం, ఎస్ఆర్ పురం, రాజయ్యపేట, గొరపల్లి, తదితర గ్రామాల్లో చెరువుల్లోకి ఎగువ ప్రాంతం నుంచి నీరు వచ్చి చేరడంతో నీటితో నిండుగా కనిపిస్తున్నాయి. దీంతో వ్యవసాయ పనుల్లో రైతులు బిజీగా మారారు. మడుల్లో దమ్ము పట్టి వరి నాట్లు వేసేందుకు సన్నద్ధమవుతున్నారు.

ఘనంగా వీఎంఆర్‌డీఏ ఆవిర్భావ దినోత్సవం



రక్తదానం చేస్తున్న వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్, తదితరులు

సిరిపురం, సెప్టెంబరు 4: వీఎంఆర్‌డీఏ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సిరిపురంలోని ఆ సంస్థ చిల్డ్రన్స్ థియేటర్‌లో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్ శిబిరాన్ని ప్రారంభించి, రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల మరొకరి ప్రాణాలను కాపాడిన వారవుతారన్నారు. ఆరోగ్యం కూడా మెరుగుపడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వీఎంఆర్‌డీఏ సంస్థ కార్యదర్శి దాట్ల కీర్తి, ఎస్టేట్ అధికారి లక్ష్మారెడ్డి, హరిప్రసాద్, ఎస్ఈ బలరామరాజు, ఇంజనీర్ రామరాజు, రేంజ్ ఆఫీసర్లు శ్యామల, శివానీ తదితరులు పాల్గొన్నారు.

బాలిక హత్య కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు

విశాఖపట్నం (లీగల్), సెప్టెంబరు 4: బాలికపై లైంగిక దాడికి పాల్పడి ఆమె మృతికి కారణమైన యువకుడికి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ. 50 వేలు జరిమానా విధిస్తూ పోక్సో న్యాయస్థానం జడ్జి ఆనంది బుధవారం తీర్పు వెల్లడించారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో ఏడాది జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని తీర్పులో పేర్కొన్నారు. అలాగే బాధితురాలి కుటుంబ సభ్యులకు నిందితుడు రూ.1.50 లక్షలు ఇవ్వాలని, ప్రభుత్వం రూ. 3 లక్షలు ఇవ్వాలని ఆదేశించారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ కరణం కృష్ణ తెలిపిన వివరాలు ప్రకారం.. బాధితురాలు (13) తన కుటుంబ సభ్యులతో కలిసి దువ్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఒక అపార్టమెంట్‌లో నివసిస్తున్నారు. అక్కడికి సమీపంలోనే దిగుమర్తి నరేష్ (28) కార్పెంటర్‌గా పని చేసేవాడు. ఈ క్రమంలో బాలికకు నరేష్‌తో పరిచయం ఏర్పడింది. అది శారీరక సంబంధానికి దారి తీసింది. 2021 అక్టోబరు 5న రాత్రి నరేష్ ఫోన్ చేయడంతో బాలిక అతని రూమ్‌కు వెళ్లింది. ఈలోపు బాలిక కనిపించలేదని ఆమె తండ్రి చుట్టుపక్కల వెతకడం ప్రారంభించాడు. గమనించిన నరేష్ బాలికను తన గది వెనుక వైపు నుంచి బయటకు వెళ్లిపొమ్మని హెచ్చరించాడు. తల్లిదండ్రులకు భయపడిన బాలిక అదే అపార్టమెంట్‌పైకి వెళ్లి అక్కడ నుంచి కిందకు దూకింది. తీవ్రంగా గాయ పడడంతో అక్కడికక్కడే మృతి చెందింది. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు దువ్వాడ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు అనంతరం చార్జిషీట్ దాఖలు చేశారు. వాదోపవాదాల అనంతరం నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు. పూర్తి సాంకేతిక పరిజ్ఞానంతో కేసును దర్యాప్తు చేసిన దువ్వాడ పోలీస్ అధికారులను న్యాయమూర్తి అభినందించారు.

రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి



గోపాలపట్నం, సెప్టెంబరు 4: రైలు నుంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన సింహాచలం రైల్వే స్టేషన్‌లో జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలివి.. సింహాచలం రైల్వే స్టేషన్‌లోని రెండవ నంబరు ప్లాట్ ఫారం శివారున ఓ వ్యక్తి మృత దేహాన్ని బుధవారం ఉదయం గుర్తించిన స్టేషన్ సిబ్బంది రైల్వే పోలీసులకు సమాచారమిచ్చారు. వెంటనే పోలీసులు వచ్చి పరిశీలించారు. అయితే, మృతుని వద్ద ఎటువంటి ఆధారాలు లభించక పోవడంతో మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించి మార్చురీలో భద్రపరిచారు. కాగా, వేగంగా వెళ్తున్న రైలు నుంచి జారిపడి మృతి చెంది ఉం టాడని పోలీసులు భావిస్తున్నారు. మృతుని సంబంధీకులు ఎవరైనా ఉంటే సంప్రదించాలని వారు కోరారు.

రక్తహీనతపై బాలింతలకు అవగాహన

అగనంపూడి, సెప్టెంబరు 4: జీవీఎంసీ 85వ వార్డు పరిధి కొండయ్యవలసలోని అంగన్‌వాడీ కేంద్రంలో సృజన వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాలింతలు, గర్భిణులకు రక్త హీనతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జె.స్రవంతి మాట్లాడుతూ బాలింతలు, గర్భిణులు ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అమలు చేస్తున్న పోషకాహార పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతిఒక్కరూ తప్పనిసరిగా పోషకాహారాన్ని తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు జె.హరనాథ్ మెహర్, శ్రీలక్ష్మీ, ప్రియాంక, అంగన్‌వాడీలు విజయకుమారి, గంగాదేవి, సుబ్బలక్ష్మీ, పైడితల్లి, మంగ, తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు అధికారికి ప్రతిష్ఠాత్మకమైన అవార్డు

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 4: స్టీల్‌ప్లాంట్ హెచ్ఆర్ విభాగం డీజీఎం దాసరి రాధికకు ప్రతిష్ఠాత్మకమైన జెండర్ డైవర్సిటీ అవార్డు లభించింది. ఇండియన్ స్టీల్ అసోసియేషన్ (ఐఎస్ఏ), స్టీల్ కాన్క్లేవ్-2024 ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఉక్కు మంత్రిత్వశాఖ మాజీ కార్యదర్శి నాగేంద్రనాథ్ సిన్హా చేతుల మీదగా రాధిక అవార్డు అందుకున్నారు. పనిలో ప్రతిభావంతురాలైన నాయకురాలిగా, ప్లాంటులో క్లిష్టమైన జోన్లలో ఆదర్శప్రాయమైన సంస్కృతిని సృష్టించేందుకు ఆమె చేసిన కృషికి ఈ అవార్డు లభించింది. ఈ సందర్భంగా స్టీల్‌ప్లాంట్ సీఎండి అతుల్‌భట్ రాధికకు అభినందనలు తెలిపారు.

కార్మిక సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాటాలు

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 4: స్టీల్‌ప్లాంటులో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కారమయ్యేంత వరకు పోరాటాలు చేస్తామని అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘ నాయకులు పేర్కొన్నారు. కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని విన్నవించినా ఫలితం లేకుండా పోయిందంటూ బుధవారం ప్లాంటులో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కార్మికుల న్యాయమైన సమస్యల పరిష్కారానికి యాజమాన్యం ముందుకు రావాలన్నారు. తమ పోరాటంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఓవీ రావు, జి.శ్రీనివాసరావు, బి.కన్నబాబు, బి.గోవింద్, రవి, రమణ, తదితరులు పాల్గొన్నారు.

'కార్మికుల ఆర్థిక ప్రయోజనాలే ఇంటక్ లక్ష్యం'

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 4: ఉక్కు కార్మికుల ఆర్థిక ప్రయోజనాలతో పాటు కర్మాగారం పరిరక్షణే ఇంటక్ లక్ష్యమని యూనియన్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ అన్నారు. యూనియన్ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇంటక్ గుర్తింపు సంఘంలో ఉన్నప్పుడు ఆర్థిక ఒప్పందాలే నేటికీ కొనసాగుతున్నాయని, వీటిలో కొన్నింటికి తూట్లు పొడిచారన్నారు. నూతనంగా కార్మికులకు ప్రయోజనం కలిగే ఒక్క ఒప్పందం చేయలేదని ఆరోపించారు. కార్మిక సమస్యలను ప్రస్తుత గుర్తింపు యూనియన్ పక్కన పెట్టిందని మండిపడ్డారు. సమావేశంలో నాయకులు కారు రమణ, బీఎస్ రాజు, ఎస్ఏ నాయుడు, సుబ్బయ్య రాథోడ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

అక్కిరెడ్డిపాలెం, సెప్టెంబరు 4: విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక రంగాల్లోనూ ప్రతిభ కనబరచాలని అక్కిరెడ్డిపాలెం హైస్కూల్ హెచ్ఎం ఎంఎల్ఎస్ కాంతం అన్నారు. గోపాలపట్నం హైస్కూల్‌లో బుధవారం జరిగిన తెలుగు పద్య పఠన పోటీల్లో సీనియర్స్ విభాగంలో ప్రథమ బహుమతి సాధించిన పాఠశాల విద్యార్థిని దానేటి మహిమను పాఠశాలలో అభినందించారు. ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, రాజ్యలక్ష్మి, కృష్ణవేణి, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

రైఫిల్ షూటింగ్‌లో సాయి కౌశిక్‌కు పతకం


సాయికౌశిక్

విశాఖపట్నం (స్పోర్ట్సు), సెప్టెంబరు 4: రాష్ట్ర స్థాయి రైఫిల్ షూటింగ్ చాంపియన్‌షిప్ టోర్నీలో నగరానికి చెందిన సాయికౌశిక్ ప్రతిభ చూపి పతకం సొంతం చేసుకున్నాడు. హైదరాబాద్‌లో జరిగిన ఈ టోర్నీలో 50మీ. రైఫిల్ ప్రోన్ ఈవెంట్‌లో రజత పతకం కైవసం చేసుకుని చెన్నైలో జరగనున్న దక్షిణ భారత రైఫిల్ షూటింగ్ పోటీలలో ఆంధ్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించేందుకు అర్హత సాధించాడు. ఇప్పటికే అనేక జాతీయ,రాష్ట్ర స్థాయి టోర్నీల్లో ప్రతిభ చూపిన సాయికౌశిక్.. సౌత్‌జోన్ టోర్నీలోనూ రాష్ట్రానికి పతకం అందిస్తాడని పలువురు ఆకాంక్షించారు.

నిత్యావసరాల ధరలు తగ్గించాలి: సీపీఐ


నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 3: ప్రభుత్వాలు డీజిల్, పెట్రోల్, వంట గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించి ప్రజలకు ఆహార భద్రత కల్పించాలని సీపీఐ నాయకుడు జి. వామనమూర్తి డిమాండ్ చేశారు. రైల్వేస్టేషన్ ప్రధాన ద్వారం ఎదుట బుధవారం ఈ మేరకు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ ఎన్నికల్లో గెలుపొందిన 100 రోజుల్లోనే నిత్యావసర వస్తువుల ధరలు తగ్గిస్తామని ప్రకటించారన్నారు. ఏడాదికి రెండు కోట్ల మందికి ప్రభుత్వోద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చి పదేళ్లు దాటినా ఇవేవీ అమలుకాలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజేష్, నాగరాజు, ఆంజనేయులు, వై.వెంకట్, రావి కృష్ణ, హెచ్ శేఖర్, గణేష్‌కుమార్, శ్రీను, అప్పలరాజు, గంగరాజు పాల్గొన్నారు.

7 నుంచి దుర్గాగణపతి ఆలయంలో ఉత్సవాలు


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఈవో రామభాయి, కార్పొరేటర్ గోవింద్

సీతంపేట, సెప్టెంబరు 4: నగరంలో ప్రసిద్ధి చెందిన సీతంపేట దుర్గాగణపతి ఆలయంలో వినాయక చవితి ఉత్సవాలను ఈ నెల 7వ తేదీ నుంచి నిర్వహించనున్నట్టు ఆలయ ఈఓ రమాభాయి, వార్డు కార్పొరేటర్, ఉత్సవ కమిటీ చైర్మన్ సారిపిల్లి గోవింద్ తెలిపారు. ఆలయంలో ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను భక్తులు, అర్చకులు నటరాజన్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గోవింద్ మాట్లాడుతూ ఈ నెల 7న దుర్గాగణపతి నిజరూపంలో బంగారు వెండి ఆభరణాలతో భక్తులకు దర్శనమిస్తారన్నారు. అనంతరం రోజుకో రూపంలో దర్శనమిస్తారన్నారు.

మట్టి విగ్రహాలు పంపిణీ

అల్లిపురం, సెప్టెంబరు 4: పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి వినాయక విగ్రహాలను వినియోగించాలని జనసేన నాయకుడు, 32వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు కోరారు. అల్లిపురం వద్దనున్న పార్టీ కార్యాలయంలో స్థానికులకు మట్టి విగ్రహాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నలినీదేవి, కేదార్నాథ్, బద్రీనాథ్, రమేష్, ఆదిబాబు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలి

» ఎమ్మెల్యే, ఫ్లోర్ లీడర్ విష్ణుకుమార్ రాజు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు. వేదికపై ఎంపీ పురందేశ్వరి

సీతమ్మధార, సెప్టెంబరు 4: బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు, వార్డు అధ్యక్షులు విజయవంతం చేయాలని ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే, ఫ్లోర్ లీడర్ విష్ణుకుమార్ రాజు పేర్కొన్నారు. సీతమ్మధారలోని కేఎస్ఆర్ ఫంక్షన్ హాలులో ఆయన ఆధ్వర్యంలో పార్టీ సభ్యత్వ నమోదుపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ ఫోన్: 88000 02024 మిస్స్‌డ్ కాల్ ఇచ్చి సభ్యత్వ నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు ఎంతగానో సహకారమందిస్తుందన్నారు. అమరావతి, పోలవరం, స్టీల్‌ప్లాంట్ విషయంలో న్యాయం జరిగేలా ముందుకు సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సురేష్ బాబు, కాశీ విశ్వనాథరాజు, రవీంద్రరెడ్డి, నాగేంద్ర, గంకల గౌత, పృథ్వీరాజ్, పుట్ట గంగయ్య, బుద్ద లక్ష్మీనారాయణ, కేశవ కాంత్, అప్పలకొండ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

27వ వార్డులో..

అక్కయ్యపాలెం: గ్రేటర్ 27వ వార్డు దొండపర్తిలో బీజేపీ దక్షిణ నియోజకవర్గ కో కన్వీనర్ కారాల మహేష్ ఆధ్వర్యంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పార్వతీపురం జిల్లా ఇన్‌చార్జి ఎస్వీఎస్ ప్రకాష్ రెడ్డి బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో శ్రీకాకుళం ఇన్‌చార్జి విజయానందరెడ్డి, నాయకులు అత్తిలి శంకరరావు, నాయకులు డి.నారాయణరెడ్డి, సత్యనారాయణ, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు రూ. లక్ష విరాళం


ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజుకి చెక్కును అందచేస్తున్న దాతలు

సీతమ్మధార, సెప్టెంబరు 4: విజయవాడ వరదల్లో బాధితుల సహాయార్థం సీఎం రిలీఫ్ ఫండ్‌కి రూ. లక్ష మారికవలసలో ఉన్న హిమాద్రి ఐస్ ప్లాంట్ యజమాని, సీతమ్మధార డాక్టర్స్ కాలనీకి చెందిన దాట్ల వెంకటరామరాజు అందించారు. సీతమ్మధారలోని బీజేపీ కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజుకి ఈ చెక్కు అందించారు. డీఎస్‌పీ వర్మ, వెంకట రామరాజు పాల్గొన్నారు.

చారిటీ బాక్స్ సంస్థ ఆర్థిక సాయం

మహారాణిపేట: విజయవాడ వరద బాధితుల కోసం చారిటీ బాక్స్ స్వచ్ఛంద సంస్థ ఆర్థిక సహాయం అందజేసింది. వర్షాలతో నిరాశ్రయులైన వారికి భోజనాలను సమకూర్చుతున్న అక్షయ పాత్ర సంస్థకు చారిటీ బాక్స్ సంస్థ రూ.11,116 అందించింది. ఈ చెక్కును సంస్థ ప్రతినిధులు వెంకటరమణ, లక్కోజు నూకరాజు శ్రీకాంత్ అక్షయపాత్ర ప్రతినిధి యదురాజును కలసి అందజేశారు.

నేడు కేరళ వామపక్ష ప్రభుత్వం.. ప్రత్యామ్నాయ పాలనపై సదస్సు

డాబాగార్డెన్స్, ఆగస్టు 4: సీపీఎం ఆధ్వర్యంలో ఈ నెల 5న డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో 'కేరళ వామపక్ష ప్రభుత్వం-ప్రత్యామ్నాయ పాలన' అంశంపై సదస్సును నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు తెలిపారు.ఈ సదస్సుకు ముఖ్య వక్తగా కేరళ మాజీమంత్రి డాక్టర్ కెశైలజా టీచర్ హాజరుకానున్నారన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి పోర్టు సహకరించాలి

» చైర్మన్ అంగముత్తుకు ఎమ్మెల్యే వంశీకృష్ణ వినతి


విశాఖ పోర్టు ట్రస్టు చైర్మన్‌కు వినతిపత్రమిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

జగదాంబ కూడలి, సెప్టెంబరు 4: విశాఖ పోర్టు ట్రస్ట్ యాజమాన్యం దక్షిణ నియోజవర్గ అభివృద్ధికి ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు బుధవారం పోర్టు ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ అంగముత్తును కలసి వినతి పత్రం అందజేశారు. విశాఖ పోర్టు కాలుష్యం నుంచి నియోజకవర్గ వాసులను కాపాడేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్.ఎల్. కాలువ ఆధునికీకరించి, ఇరువైపులా మొక్కలు నాటాలని కోరారు. 34,35,39 వార్డుల్లో సామాజిక భవనాలను నిర్మించాలన్నారు. కేజీహెచ్, ఘోసాసుపత్రుల్లో నూతన భవన నిర్మాణానికి సహకరించాలని కోరారు. ఫిషింగ్‌హార్బర్‌లో ఆక్షన్ భవనం నిర్మించాలని కోరారు. హార్బర్‌లో క్రేన్లు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. గ్రేటర్ 35వ వార్డు లక్ష్మీనగర్‌లో నిర్మించనున్న ఇళ్లకు పోర్టు ట్రస్ట్ ఆర్థికంగా సహకరించాలన్నారు. మహిళలకు కుట్టుమిషన్లు అందించాలని సూచించారు.నెహ్రూ బజార్, జనతాబజార్ ఆధునికీకరణకు చేయూతందించాలని వివరించారు. ఈమేరకు సహకరిస్తామని పోర్టు చైర్మన్ అంగముత్తు హామీ ఇచ్చారు.

హెల్మెట్ లేని 149 మంది డ్రైవింగ్ లైసెన్స్‌లు సస్పెన్షన్


వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీస్ అధికారులు

మురళీనగర్, సెప్టెంబరు 4; నగర వ్యాప్త తనిఖీల్లో బుధవారం హెల్మెట్ లేకుండా వాహనాలు నడుపుతున్న 149 మంది డ్రైవింగ్ లైసెన్స్‌లు తాత్కాలికంగా రద్దు చేయడంతో మరో 227 మందిపై కేసులు నమోదు చేసినట్టు విశాఖ డిప్యూటీ రవాణా కమిషనరు జి.సి.రాజారత్నం తెలిపారు. ఈ మేరకు సిఫార్సు చేస్తూ పోలీసు అధికారులు తమ కార్యాలయానికి పంపించారని తెలిపారు. ద్విచక్ర వాహనం నడిపే వ్యక్తితోపాటు వెనుక ప్రయాణించేవారికీ హెల్మెట్ తప్పనిసరి అని డీటీసీ ఈ సందర్భంగా పేర్కొన్నారు. లేని పక్షంలో ఇద్దరి డ్రైవింగ్ లైసెన్సులను రద్దు చేస్తామని హెచ్చరించారు. విశాఖ నగరవ్యాప్తంగా రోడ్డు ప్రమాదాలు నియంత్రించేందుకు ఈనెల 1వ తేదీ నుంచి ఈ మేరకు కఠిన నిబంధనలు అమలుచేస్తున్నామన్నారు.

విమానంలో సాంకేతిక సమస్య

మరమ్మతులు చేపట్టాక బయలుదేరిన వైనం

గోపాలపట్నం, సెప్టెంబరు 4: విమానంలో సాంకేతిక సమస్య తలెత్తడంతో టేకాఫ్ జరిగినకాసేపటికే తిరిగి ల్యాండింగ్ అయింది. ఎయిర్‌పోర్టులో బుధవారం ఉదయం విశాఖ నుంచి హైదరాబాద్ వెళ్లేందుకు విమానం బయలుదేరింది. అయితే టేకాఫ్ అయినకాసేపటికే విమానంలో సాంకేతిక సమస్య తలెత్తడంతో పైలట్లు వెంటనే విమానాశ్రయంలోల్యాండింగ్ చేశారు.విమానంలోతలెత్తినసమస్యకుసాంకేతిక నిపుణులు మరమ్మతులు చేపట్టాక గంట ఆలస్యంగా హైదరాబాద్ బయలుదేరి వెళ్లింది.

దారిదోపిడీ కేసులో ఇద్దరి అరెస్టు

కంచరపాలెం, సెప్టెంబరు 4: దారి దోపిడీకు పాల్పడిన ఇద్దరు నిందితులను కంచరపాలెం నేరవిభాగం పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. వివరాలివి.. గత నెల 21తేదీన కాన్వెంటు కూడలి వద్ద బి.మధు అనే వ్యక్తి బస్సు కోసం ఎదురుచూస్తుండగా, ఆటుగా బైక్‌పై వస్తున్న ముగ్గురు అతనిపై దాడి చేసి సెల్‌ఫోన్, కొంత నగదును అపహరించుకుని వెళ్లిపోయారు. దీంతో బాధితుడు ఫిర్యాదుపై విచారణ చేపట్టి మధురవాడ ప్రాంతానికి చెందిన జి.చైతన్య, శ్రీకాకుళం జిల్లాకు చెందిన గంగు భాస్కరరావును అదుపులోకి తీసుకున్నట్టు సీఐ శ్రీనివాసరావు పేర్కొన్నారు. నిందితులు గతంలో పోర్టులో గ్యాంగ్ పనులు చేస్తున్నట్టు చెప్పారు.

భీమిలి సొసైటీకి రూ.2.83 లక్షల జరిమానా

విశాఖపట్నం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): భీమిలి మండలం నేరేళ్లవలస రెవెన్యూ సర్వే నంబర్ 118/5ఎలో లేఅవుట్ అభివృద్ధి నిమిత్తం అనధికారికంగా 511 క్యూబిక్ మీటర్ల గ్రావెల్ తరలించినందుకు మ్యూచువల్ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీకి రూ.2,83,758 జరిమానా విధిస్తూ గనుల శాఖ డిమాండ్ నోటీస్ జారీచేసింది. లేఅవుట్ అభివృద్ధికి మొత్తం 39,452.512 క్యూబిక్ మీటర్ల గ్రావెల్ వినియోగించారు. ఈ మేరకు గనుల శాఖ గత నెలలో సర్వే చేసి సంబంధిత సొసైటీకి షోకాజ్ జారీచేసింది. దీనిపై సొసైటీ ప్రతినిదులు లేఅవుట్ అభివృద్ధి కోసం ఆనందపురం మండలం జగన్నాథపురంలో రామరాజు అనే వ్యక్తికి చెందిన క్వారీ నుంచి 38,943 క్యూబిక్ మీటర్ల గ్రావెల్ కొనుగోలు చేసినట్టు బిల్లులు సమర్పించారు. క్యూబిక్ మీటరుకు రూ.106 వంతున జగన్నాథపురం క్వారీ యజమాని ప్రభుత్వానికి చెల్లించిన తాత్కాలిక పర్మిట్ల కాపీలను అందజేశారు. గనుల శాఖ ఇచ్చిన షోకాజ్‌లో పేర్కొన్న 39,452 క్యూబిక్ మీటర్లలో 38,943 క్యూబిక్ మీటర్లకు బిల్లులు ఉండడంతో మిగిలిన 511 క్యూబిక్ మీటర్ల గ్రావెల్ అనధికారికంగా తరలించారని తేల్చింది. అందుకు రూ.2,83,758 చెల్లించాలని డిమాండ్ నోటీస్ సొసైటీకి పంపినట్టు జిల్లా గనుల శాఖ అధికారి డీవీఈఎస్ఎస్ రాజు తెలిపారు.

ఎమ్మెల్యేని మర్యాదపూర్వకంగా కలిసిన జెడ్సీ

మాధవధార, సెప్టెంబరు 4 ; జీవీఎంసీ జోన్-5 జోనల్ కమిషనర్‌గా బి.రాము బుధవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన శాసన సభ్యులు పి. విష్ణుకుమార్‌రాజుని మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు. అనంతరం జోన్ పరిధిలోని పలు అంశాలపై ఎమ్మెల్యేతో చర్చించారు.

ప్రత్యేక రైళ్లు కొనసాగింపు

విశాఖపట్నం, సెప్టెంబరు 4: వరుస పండుగల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్ర యాణికుల సౌకర్యార్థం దువ్వాడ మీదుగా వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తున్న ప్రత్యేక రైళ్లను మరికొన్ని ట్రిప్పులు కొనసాగించనున్నట్టు సీనియర్ డీసీఎం కె. సందీప్ తెలిపారు. వీటిలో కొచువేలి-షాలిమార్ ఎక్స్‌ప్రెస్ (06081) ఈనెల 20 నుంచి నవంబరు 29 వరకు ప్రతి శుక్రవారం సాయంత్రం 4.20 గంటలకు కొచువేలిలోబయలుదేరి మర్నాడురాత్రి 10.52 గంటలకు దువ్వాడ, ఆదివారం మధ్యాహ్నం 1.40 గంటలకు షాలిమార్ చేరుతుంది. తిరిగి ఈ రైలు ఈనెల 23 నుంచి డిసెంబరు 2 వరకు ప్రతి సోమవారం మధ్యాహ్నం 2.20 గంటలకు షాలిమార్‌లో బయలుదేరుతుంది. తిరునెల్వేలి-షాలిమార్ ఎక్స్‌ప్రెస్ (06087) ఈనెల 12 నుంచి నవంబరు 28 వరకు ప్రతి గురువారం తెల్లవారుజాము 1.50 గంటలకు తిరునెల్వేలిలో బయలుదేరి మర్నాడు ఉదయం 4.47కు దువ్వాడ, రాత్రి 9.00 గంటలకు షాలిమార్ చేరుతుంది. తిరిగి ఈనెల 14 నుంచి నవంబరు 30 వరకు ప్రతి శనివారం సాయంత్రం 5.10 గంటలకు షాలిమార్‌లో బయలుదేరుతుంది. కొయంబత్తూరు-బరౌని ఎక్స్‌ప్రెస్ (06059) ఈనెల పది నుంచి నవంబరు 26 వరకు ప్రతి మంగళవారం ఉదయం 11.50 గంటలకు కొయంబత్తూరులో బయలుదేరుతుంది. అలాగే, ఈ ఎక్స్‌ప్రెస్ (06060) ఈనెల 13 నుంచి 29వ తేదీ వరకు ప్రతి శుక్రవారం రాత్రి 11.45 గంటలకు బరౌనిలో బయలుదేరుతుంది. ఎర్నాకులం-పాట్నా ఎక్స్‌ప్రెస్ (06085) ఈనెల 13 నుంచి 29 వరకు ప్రతి శుక్రవారం రాత్రి 11.00 గంటలకు ఎర్నాకులంలో బయలుదేరుతుంది. తిరిగి ఈనెల 16 నుంచి డిసెంబరు 2 వరకు ప్రతి సోమవారం రాత్రి 11.45 గంటలకు పాట్నాలో బయలుదేరుతుంది. కొయంబత్తూర్-ధనబాద్ ఎక్స్‌ప్రెస్ (06063) ఈనెల 13 నుంచి నవంబరు 29 వరకు ప్రతి శుక్రవారం...తిరిగి ఈనెల 16 నుంచి డిసెంబరు రెండు వరకు ప్రతి సోమవారం ఉదయం 6.00 గంటలకు ధనబాద్‌లో బయలుదేరుతుందన్నారు.

నేడు తిరువనంతపురం, షాలిమార్ రైలు రద్దు

జత రేక్ కొరత నేపథ్యంలో వయా విశాఖ మీదుగా తిరువనంతపురం నుంచి షాలిమార్ వెళ్లే ఎక్స్‌ప్రెస్ (22642) రైలును గురువారం రద్దు చేసినట్టు సీనియర్ డీసీఎం తెలిపారు. కాగా విశాఖ-సికింద్రాబాద్ గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్ (12739), సికింద్రాబాద్-విశాఖ గరీబ్‌రథ ఎక్స్‌ప్రెస్ (12740), చెన్నై సెంట్రల్-హౌరా మెయిల్ ఎక్స్‌ప్రెస్ (12840) రైళ్లు బుధవారం (4న) రద్దయ్యాయి.

కవి సమాజ నిర్దేశకుడు

సీతంపేట, సెప్టెంబరు 4: కవిత్వంతో మార్గ నిర్దేశం చేసి నవ సమాజ నిర్మాణానికి బాటలువేసే దీపధారి కవి అని రచయిత డాక్టర్ కేజీ వేణు పేర్కొన్నారు. సీతంపేట రాజేంద్రనగర్‌లో ప్రిజం కళాశాలలో సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో కవి సమ్మేళనాన్ని నిర్వహించారు. సంస్థ అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన ఈసభలో వేణు మాట్లాడుతూ, భావం, భాష రెండింటి సమన్వయమే కవిత్వమన్నారు. కవి తన సంవేదనను స్పష్టంగా వ్యక్తపరిచి పాఠకుడిని ఆలోచింప చేయాలన్నారు. కార్య క్రమంలో డాక్టర్ సూరపనేని విజయ్‌కుమార్, చిన సూర్యానారాయణ, డాక్టర్ కేవీఎస్ మూర్తి, పిళ్లా రమణమూర్తిపాల్గొన్నారు.

ఉక్కుకు బొగ్గు కొరత

... 5వ పేజీ తరువాయి

కావలసి ఉండగా ఇప్పుడు కేవలం 5 వేల టన్నులకు తగ్గిపోయింది.

ప్రయత్నాలు విఫలం

స్టీల్ యాజమాన్యం ముడి పదార్థాల సేకరణకు అన్ని రకాల ప్రయత్నాలు చేస్తోంది. కానీ ఏవీ కలిసి రావడం లేదు. ఒకవైపు బొగ్గు, మరో వైపు ఐరన్‌ఓర్, ఇంకో వైపు విద్యుత్ కొరత వేధిస్తున్నాయి. నిధులు లేకపోవడంతో ఉక్కిరిబిక్కిరి అవుతోంది. ఎన్ఎండీసీ నుంచి రూ.1,500 కోట్లు ఇప్పిస్తామన్నారు. ఇంతవరకూ ఆవి కూడా రాలేదు. అత్యవసరంగా బ్యాంకులకు రూ.415 కోట్లు చెల్లించాల్సిన పరిస్థితి వచ్చింది. ఆ మొత్తం కట్టకపోతే ఇబ్బందులు వస్తాయని కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖకు తెలియజేశారు. మరోవైపు జీతాలు ఇవ్వడం లేదని ఉద్యోగులు ఆందోళన చేస్తున్నారు. తాజాగా త్రిఫ్ట్ సొసైటీ సొమ్ము రూ.60 కోట్లు వాడేశారంటూ యాజమాన్యానికి వ్యతిరేకంగా కార్మిక సంఘాలు బుధవారం ఆందోళన చేపట్టాయి.

జాతీయ సంపద నాశనం చేయొద్దు

- అయోధ్యరామ్, కన్వీనర్, ఉక్కు పోరాట కమిటీ

విశాఖపట్నం స్టీల్‌ప్లాంటు జాతీయ సంపద. వేల కోట్ల రూపాయల విలువైనది. కేవలం ముడి పదార్థాలు అందుబాటులో లేక నిర్వీర్యం అయిపోతోంది. ఏదైనా నష్టం జరిగితే పూడ్చుకోవడానికి మళ్లీ వందల కోట్ల రూపాయలు ఖర్చు చేయాలి. ఇప్పటికే సిబ్బంది అనేక త్యాగాలు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే ఆదుకోవాలి.

యాజమాన్యం అవాస్తవాల ప్రచారం ఆపాలి

-వరసాల శ్రీనివాసరావు, కార్మిక సంఘ నాయకులు

ప్లాంటు పరిస్థితి చాలా దయనీయంగా ఉంది. సంక్షోభం నుంచి గట్టెక్కించకుండా అది చేస్తాం..ఇది చేస్తాం అంటూ యాజమాన్యం అవాస్తవాలు ప్రచారం చేస్తోంది. అద్భుతాలు చేస్తామనే మాటలు మానేసి ముడి పదార్థాలు సమకూర్చాలి.

గ్రేటర్ టెండర్‌లపై నేతల కన్ను

... 5వ పేజీ తరువాయి

యార్డుకు తరలిస్తామని జీవీఎంసీ నుంచి కాంట్రాక్టు దక్కించుకున్నవారు వాటిని చేపల పెంపకందారులకు అమ్మడం మొదలుపెట్టారు. దీనివల్ల భారీగా ఆదాయం సమకూరుతుండడంతో చికెన్ వ్యర్థాల సేకరణకు పోటీ పెరిగిపోయింది. జీవీఎంసీ నుంచి బిల్లు తీసుకోవడం మానేసి, తిరిగి డబ్బులు కడతామనే పరిస్థితికి కాంట్రాక్టర్లు వచ్చారంటే పరిస్థితి ఏ విధంగా ఉన్నదీ అర్థం చేసుకోవచ్చు. ఇదిలావుండగా గతంలో ఇచ్చిన కాంట్రాక్టు గడువు ముగియడంతో జీవీఎంసీ వ్యర్థాల సేకరణ, తరలింపునకు ఈ-ప్రొక్యూర్‌మెంట్‌లో ఇటీవల రూ.1.57 కోట్ల అంచనాతో టెండర్లు పిలిచింది. ప్రతి జోన్‌ను ఒక వర్క్‌గా విభజించింది. కాంట్రాక్టరే సొంతంగా వాహనంతోపాటు డ్రైవర్, వర్కర్లను సమకూర్చుకోవాలని, సేకరించిన వ్యర్థాలను కాపులుప్పాడలోని యార్డుకు మాత్రమే తరలించాలని, ప్రతిరోజూ కనీసం పది టన్నుల వ్యర్థాలను సేకరించాలని టెండర్‌లో నిబంధన విధించింది. అయినప్పటికీ టెండర్ దక్కించుకునేందుకు చాలామంది పోటీ పడుతున్నట్టు ప్రచారం జరుగుతోంది.

కూటమి నేతలను ఆశ్రయిస్తున్న కాంట్రాక్టర్లు

వ్యర్థాల సేకరణ, తరలింపునకు జీవీఎంసీ పిలిచిన టెండర్లను దక్కించుకునేందుకు ఆసక్తి చూపుతున్నవారంతా తమకు తెలిసిన కూటమి నేతలను ఆశ్రయిస్తున్నారు. ఎలాగైనా తమకు టెండర్ వచ్చేలా చూడాలంటూ కోరుతున్నారు. దీంతో కూటమి నేతలు జీవీఎంసీ అధికారులకు ఫోన్ చేసి చికెన్ వ్యర్థాలకు సంబంధించి తమ పరిధిలోని జోన్ టెండర్ తాను చెప్పిన వ్యక్తికి దక్కేలా చూడాలంటూ ఆదేశిస్తున్నారు. ఎవరైనా టెండర్ వేసినా వారిని ఏదోలా అనర్హులుగా తేల్చేయాలని సూచిస్తున్నారు. కూటమికి చెందిన ఒక నేతతోపాటు ముగ్గురు ప్రజా ప్రతినిధులు జీవీఎంసీ అధికారులకు ఫోన్ చేసి తమ వారికి టెండర్ వచ్చేలా చూడాలని ఆదేశించినట్టు తెలిసింది. అలాగే వైసీపీ నేతలు కొందరు తమతో బాగా పరిచయం కలిగిన కూటమి ప్రజా ప్రతినిధుల ద్వారా తమ అస్మదీయులకు టెండర్ ఇప్పించుకునేందుకు యత్నిస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఇదిలావుండగా చికెన్ వ్యర్థాలతో పెరిగిన చేపలను తింటే క్యాన్సర్‌తోపాటు జీర్ణకోశ సంబంధిత రోగాలు చుట్టుముడతాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకునైనా చికెన్ వ్యర్థాలను చేపల చెరువులకు వెళ్లకుండా అడ్డుకట్ట వేయాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

7 నుంచి లక్ష్మీ గణేశ్ దేవస్థానంలో ఉత్సవాలు

విశాఖపట్నం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రైల్వే న్యూకాలనీలోని శ్రీలక్ష్మీ గణేశ్ దేవస్థానంలో ఈ నెల 7వ తేదీ నుంచి 16వ తేదీ వరకు వినాయ చవితి మహోత్సవాలు నిర్వహించనున్నట్టు ఈఓ సురేశ్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో వాటర్ ప్రూఫ్ పెండాళ్లు వేసి పూలు, విద్యుద్దీపాలతో అలంకరిస్తామన్నారు. మహా అన్నదానం చేస్తామన్నారు. రోజూ సాంస్కృతి కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఈ పనులు నిర్వహణకు ఆసక్తి కలిగినవారు ఈనెల 6వతేదీ ఉదయం 10 గంటలలోగా సీల్డ్ కొటేషన్లతో దేవస్థానం వద్ద హాజరు కావాలని సూచించారు.

మాదక ద్రవ్యాల రవాణాపై ప్రత్యేక నిఘా


జ్ఞానాపురం రైల్వే స్టేషన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న సీఐ భాస్కరరావు, సిబ్బంది

కంచరపాలెం, సెప్టెంబరు 4: మాదక ద్రవ్యాల రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేసినట్టు కంచరపాలెం సీఐ ఎస్.భాస్కరరావు తెలిపారు. బుధవారం కంచరపాలెం, జ్ఞానాపురం రైల్వే స్టేషన్ పరిసరాల్లో సిబ్బందితో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. సీఆర్‌పీఎఫ్ సిబ్బంది, స్నిపర్ డాగ్స్‌తో తనిఖీలు చేపట్టారు.ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నగరం నుంచి అన్ని వైపులా నుంచి గంజాయి, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా నిరోధానికి విస్తృత తనిఖీలు చేపడుతున్నామన్నారు. గంజాయి రవాణాపై సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు.

వరద బాధితులకు నేవీ, ఎయిర్‌ఫోర్స్ సహాయం


విజయవాడలో ఆహార పదార్థాలను కిందికి దించుతున్న నేవీ సిబ్బంది

విశాఖపట్నం, సెప్టెంబరు 5 : విజయవాడ వరదబాధిత ప్రాంతాల్లోని వారికి ఇండియన్ ఎయిర్ ఫోర్స్, ఇండియన్ నేవీ హెలీకాప్టర్ల ద్వారా ఆహారం, తాగునీరు, మందులు తదితర వాటిని పంపిణీ చేస్తున్నారు. పౌరసరఫరాల విభాగం ఆధ్వర్యంలో ఈ సేవలందిస్తున్నారు. ఇళ్ల పైకప్పులు, డాబాలు, అపార్టమెంట్లపై ఉన్న నిరా శ్రయులకుహెలీకాప్టర్ల ద్వారా ఆహారం అందజేస్తున్నారు. బుధవారం సాయంత్రం వరకు 58,000 కిలోల ఆహారంతో పాటు మందులు, తాగునీరు అందజేసినట్టు నేవీ, ఎయిర్ ఫోర్సులు ప్రకటించాయి.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం


ఎగ్జిబిషన్‌లో స్టాల్స్‌ని తిలకిస్తున్న ఆచార్య బాలమోహన్‌దాస్

సీతమ్మధార, సెప్టెంబరు 4: విద్యార్థులు చదువుతోపాటు ఆరోగ్యంపై కూడా దృష్టిసారించాలని నాగార్జున యూనివర్సిటీ పూర్వ ఉపకులపతి ఆచార్య బాల మోహన్‌దాస్ పేర్కొన్నారు. డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాలలో జీవశాస్త్రం విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ పోషకాహార వారోత్సవాలను, పోషక పదార్థాల ఎగ్జిబిషన్‌ను ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో యూజీఎస్‌పీజీ కళాశాలలకు ప్రిన్సిపాల్ డాక్టర్ జీఎస్‌కే చక్రవర్తి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ, యూజీ సైన్స్ కో ఆర్డినేటర్ డాక్టర్ డి.దీనబంధు, విభాగాధిపతులు డాక్టర్ ఎం.భారతి, డాక్టర్ ఎస్.శుభ, డాక్టర్ బిశైలజ, డాక్టర్ గీత, కమిటీ సభ్యులు డాక్టర్ డి.మన్మశ్రీ, ఎం సునీత, ఆర్.స్వప్న తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే ప్రీ డయాబెటిక్‌ను అధిగమించవచ్చు

మహారాణిపేట: దేశ వ్యాప్తంగా ప్రీ డయాబెటిక్ కేసులు పెరుగుతున్నాయని ప్రముఖ వైద్య నిపుణులు రోహిణీ పాటిల్ అన్నారు. మంగళవారం జిల్లా పరిషత్ వద్ద ఓ సమావేశమందిరంలో ప్రీ డ యాబెటిక్‌పై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అధ్యయనాల ప్రకా రం దేశంలో 15 శాతం మంది ప్రీ డయాబెటిక్ తో బాధపడుతున్నారన్నారు. పోషకాహారంతోనే దీనిని అధిగమించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు వైద్యులు పాల్గొన్నారు.

ఘనంగా 'ఐఎన్ఎస్ సుమిత్ర' వార్షికోత్సవం


వార్షికోత్సవంలో పాల్గొన్న అధికారులు, సిబ్బంది

విశాఖపట్నం, సెప్టెంబరు 4: నేవల్ ఆఫ్‌షోర్ పెట్రోల్ వెజల్ నౌక ఐఎన్ఎస్ సుమిత్ర పదో వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగాయి. ఈస్టర్న్ ఫ్లీట్ ఈ ఉత్సవాలు నిర్వహించారు. ఇందులో భాగంగా సముద్రంలో ఐఎన్ఎస్ సుమిత్ర పలు విన్యాసాలు చేసింది. అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

గోపాలపట్నం, సెప్టెంబరు 4: రైలు నుంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన సింహాచలం రైల్వే స్టేషన్‌లో జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలివి.. సింహాచలం రైల్వే స్టేషన్‌లోని రెండవ నంబరు ప్లాట్ ఫారం శివారున ఈ మృత దేహాన్ని బుధవారం ఉదయం గుర్తించిన స్టేషన్ సిబ్బంది రైల్వే పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు వచ్చి పరిశీలించారు. అయితే, మృతుని వద్ద ఎటువంటి ఆధారాలు లభించక పోవడంతో మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించి మార్చురీలో భద్రపరిచారు. కాగా, వేగంగా వెళ్తున్న రైలు నుంచి జారిపడి మృతి చెంది ఉం టాడని పోలీసులు భావిస్తున్నారు. మృతుని సంబంధీకులు ఎవరైనా ఉంటే సంప్రదించాలని వారు కోరారు.

15లోగా ఈ-పంట నమోదు పూర్తి

పద్మనాభం, సెప్టెంబరు 4 : ఈనెల 15వ తేదీలోగా ఈ-పంట నమోదు పూర్తి చేయనున్నట్టు జిల్లా వ్యవసాయాధికారి అప్పలస్వామి తెలిపారు. బుధవారం ఆయన కోరాడ, కృష్ణాపురం, మద్ది గ్రామాల్లో జరుగుతున్న ఈ-పంట నమోదును పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు పంట పొలాల్లో నీరు లేకుండా చూడాలన్నారు. ముంపులో ఉన్న పంటలకు బూస్టర్ డోస్ ఎరువులు వేయాలని రైతులకు సూచించారు. అనంతరం ఆయన మద్ది గ్రామంలో ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేశారు.

మండపాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి : సీఐ

పద్మనాభం (రూరల్), సెప్టెంబరు 4 : వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసే మండపాలకు అనుమతి తప్పనిసరి అని సీఐ సీహెచ్ శ్రీధర్ చెప్పారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఉత్సవాల నిర్వహణకు కమిటీగా ఏర్పడి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సింగిల్ విండో విధానంలో లాగిన్ అయి నిర్దేశించిన చలానా మొత్తం చెల్లించి అనుమతి పొందాలని కోరారు.

శ్రీకృష్ణుడి ప్రతిమ ఊరేగింపు

భీమునిపట్నం (రూరల్), సెప్టెంబరు 4 : లక్ష్మీపురం, మజ్జివలస, సింగనబంద, కృష్ణంరాజుపేట గ్రామాల్లో త్రైత సిద్ధాంత ప్రబోధ సమితి ఆధ్వర్యంలో శ్రీకృష్ణుడి ప్రతిమను బుధవారం ఊరేగించారు. ఆయా గ్రామాల్లో గత నెల 26 నుంచి జరుగుతున్న కృష్ణాష్టమి ఉత్సవాల ముగింపులో భాగంగా ఈ ఊరేగింపు చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచులు నారాయణ, ఎల్. జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ

ఆరిలోవ, సెప్టెంబరు 2 : చినగదిలి మండలంలోని పైనాపిల్ కాలనీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పరిశుభ్రతపై బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం రామరాజు, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

కొమ్మాది, సెప్టెంబరు 4 : గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని 5వ వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత అన్నారు. బుధవారం మారికవలస అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు.

బాలిక ఆత్మహత్య

ఆరిలోవ, సెప్టెంబరు 4 : సంజయ్‌గాంధీ కాలనీకి సమీపంలో నివాసం ఉంటున్న బాలిక (16) బుధవారం ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఆరిలోవ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. బాలిక తల్లి దండ్రులు భవన నిర్మాణ కార్మికులు. ఆమె తన అమ్మమ్మ ఇంట్లో ఉంటూ చదుకుంటుంది. బుధవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతుకి గల కారణాలు తెలియరాలేదు. బాలిక తండ్రి ఫిర్యాదుమేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వసతి గృహాలు తనిఖీ

విశాఖపట్నం, సెప్టెంబరు 4 : ఏయూలోని వసతి గృహాలను అధికారులు బుధవారం తనిఖీ చేశారు. రాత్రి ఇంజనీరింగ్, ఆర్ట్స్, సైన్స్ కళాశాల వసతి గృహాలను పరిశీలించి, విద్యార్థులు ఏవిధంగా ఉంటున్నారు, ఏం చేస్తున్నారు, బయట వ్యక్తులు ఎవరైనా ఉంటున్నారా అన్న విషయాలపై ఆరాతీశారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ రమేష్‌బాబు, హాస్టల్స్ చీఫ్ వార్డెన్ హరినాథ్, రమేష్‌బాబు, చిట్టిబాబు ఉన్నారు.

నేడు కశిరెడ్డి విగ్రహావిష్కరణ

పద్మనాభం, సెప్టెంబరు 4 : మండలంలోని రెడ్డిపల్లి గ్రామానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు కశిరెడ్డి పాపయ్య విగ్రహావిష్కరణ గురువారం ఆ గ్రామంలోని ఉన్నత పాఠశాలలో జరగనుంది.ఈమేరకు ఆయన కుటుంబ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

10, 11 తేదీల్లో దాశరథి శత జయంత్యుత్సవాలు

వెంకోజీపాలెం, సెప్టెంబరు 4 : ఏయూ తెలుగు శాఖ, ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం సంయుక్తంగా ఈనెల 10, 11 తేదీల్లో నిర్వహించనున్న దాశరథి కృష్ణమాచార్య శత జయం త్యుత్సవాలను జయప్రదం చేయాలని వీసీ శశిభూషణరావు కోరారు.బుధవారం ఆయన తన కార్యాలయంలో ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు.

సినిమా గైడ్

● **ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్:** మెలోడి, శరత్, శ్రీరామ, శ్రీకన్య, కిన్నెర, శారద, సౌజన్య (గోపాలపట్నం), శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), అరుణ (పెదగంట్యాడ), లిఖిత (శ్రీహరిపురం), లక్ష్మీకాంత్ (గాజువాక).

● **సరిపోదా శనివారం :** జగదాంబ, సంగం, కామేశ్వరి, శ్రీరామ, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), కన్య-1,2 (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)

● **మారుతీనగర్ సుబ్రహ్మణ్యం :** నటరాజ్ (పెందుర్తి), లక్ష్మీకాంత్ (గాజువాక)

● **ఆయ్ :** రమాదేవి, వెంకటేశ్వర-2, శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), హెవెన్-3 (గాజువాక), రాములమ్మ (తగరపువలస)

● **కమిటీ కుర్రోళ్ళు :** శ్రీవెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మోహిని (గాజువాక), నటరాజ్ (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)

● **తంగలాన్ :** నటరాజ్ (పెందుర్తి), లక్ష్మీకాంత్ (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 50, టమాటా 28, వంకాయలు (తెలుపు) 32, వంకాయలు (నలుపు) 36, బెండకాయలు 38, పచ్చిమిర్చి 38, కాకరకాయలు 24, బీరకాయలు 36, ఆనపకాయలు 20, కాలీఫ్లవర్ 34, క్యాబేజి 22, క్యారెట్ 32, దొండకాయలు 32, బంగాళదుంపలు 29, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 42, అల్లం (పాతది) 110, బరబటి 40, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 100, గోరుచిక్కుడు 34, దోసకాయ 22, వెల్లుల్లి (పెద్దవి) 280, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 98, పొటల్స్ 34, కీరదోస 32, కాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 40, చిలగడదుంపలు 48, కంద 54, దేముడు చిక్కుడు 62, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాల కూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 28, మామిడి అల్లం 70, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	505
విజయనగరం	509
శ్రీకాకుళం	509

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	91
ఫారం ధర	--	111
విత్ స్కిన్	--	192
స్కిన్‌లెస్	--	202

గురుతర బాధ్యత

సమాజ నిర్దేశకులు ఉపాధ్యాయులు

- తల్లిదండ్రుల తరువాత స్థానం వారిదే
- ఉపాధ్యాయుడిగా పని చేసిన సర్వేపల్లి
- ఏయూతో ఐదేళ్లు అనుబంధం
- 1931 నుంచి 1936 వరకూ వీసీగా సేవలు
- తొలి గౌరవ డాక్టరేట్ గ్రహీత

నేడు ఉపాధ్యాయుల దినోత్సవం



గురువు అంటే ఒక బాధ్యత. సమాజంలో ఏది మంచి, ఏది చెడు, ఎటువైపు నడిస్తే ఏం జరుగుతుందో పిల్లలకు నిర్దేశించడం ద్వారా దేశానికి మంచి పౌరులను అందించడం ఒక్క ఉపాధ్యాయుడే సాధ్యం. ఒక్క ముక్కలో చెప్పాలంటే సమాజ నిర్దేశకుడు గురువు. అందుకే తల్లిదండ్రుల తరువాత స్థానం వారికిచ్చారు. అన్ని వృత్తుల కంటే ఉపాధ్యాయ వృత్తి అత్యంత పవిత్రమైనది. విలువైనది. బాధ్యతతో కూడుకున్నది. జాతిని మేల్కొలపాలంటే ఒక్క గురువుకే సాధ్యం. తల్లిదండ్రులు జన్మనిస్తే.. గురువు బతుకును ఇస్తాడు. దేశ తొలి ఉప రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి పురస్కరించుకుని ఏటా సెప్టెంబరు 5న ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. దేశానికి రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి కాకముందు రాధాకృష్ణన్ ఉపాధ్యాయుడిగా పనిచేశారు. ఆయనకు ఏయూతో ఎంతో అనుబంధం ఉంది. ఇక్కడ ఐదేళ్ల పాటు వీసీగా పని చేయడమే కాకుండా తొలి గౌరవ డాక్టరేట్ అందుకున్నారు.

ఏయూలో తొలి ప్రసంగం



1927లో ఏయూ స్నాతకోత్సవంలో పాల్గొన్న సర్వేపల్లి రాధాకృష్ణన్ తొలి ప్రసంగం చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆంధ్రులపై పొగడ్తలు వర్షం కురిపించారు. అదృష్టవశాత్తూ ఆంధ్రులమంతా కొన్ని విషయాల్లో స్థిత ప్రజ్ఞులం అంటూ పేర్కొన్నారు. దేశంలోని ఏ ప్రాంతమైనా సమర్థవంతమైన ఐక్యతా భావాన్ని పెంపొందించు కోగులుగుతుందంటే అది ఆంధ్రాలోనే అని తాను నమ్ముతానంటూ పేర్కొన్నారు. మాతృభాషపై ప్రేమ ప్రతి ఒక్కరినీ బంధిస్తుందంటూ వ్యాఖ్యానించారు.

విశాఖపట్నం/ఆంధ్రజ్యోతి

దేశంలోని పురాతన విశ్వవిద్యాలయాల్లో ఆంధ్ర యూనివర్సిటీ ఒకటి. ఇక్కడ వైస్ చాన్సలర్‌గా సర్వేపల్లి రాధాకృష్ణన్ పని చేశారు. ఉప రాష్ట్రపతి, రాష్ట్రపతి కాకముందు ఆయన కొన్నేళ్ల పాటు ఉపాధ్యాయ వృత్తి చేపట్టారు.వేదాంతిగా, తత్వవేత్తగా, పాలనా దక్షుడిగా కూడా ఆయనకు ఎంతో పేరుంది. తమిళనాడులోని తిరుత్తణిలో 1988 సెప్టెంబరు ఐదో తేదీన జన్మించిన ఆయన అనేక ప్రాంతాల్లో ఉపాధ్యాయుడిగా పని చేశారు. ఈ క్రమంలోనే ఏయూ వైస్ చాన్సలర్‌గా 1931 నుంచి 1936 వరకూ పని చేసి వర్సిటీ అభివృద్ధికి కృషి చేశారు. ఏయూకి రెండో వైస్ చాన్సలర్‌గా ఆయన సేవలందించారు. వీసీ కాకముందు 1927లో వర్సిటీ నిర్వహించిన తొలి స్నాతకోత్సవంలో పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వర్సిటీ గౌరవ డాక్ట రేట్‌ను ఆయనకు ప్రదానం చేసింది. ఆ తరువాత కాలంలో ఆయన వీసీగా వచ్చారు. అనంతరం దేశానికి ఉప రాష్ట్రపతిగా, రాష్ట్రపతిగా పనిచేశారు. వీసీగా పనిచేసిన ఐదేళ్లలో ఆయన తీసుకున్న అనేక నిర్ణయాలు వర్సిటీ అభివృద్ధికి దోహదం చేశాయి. ఆయన హయాంలో రవీంద్రనాథ్ ఠాగూర్ ప్రసంగం ఏర్పాటు చేయగా, నోబుల్ బహుమతి గ్రహీత సర్ సీవీ రామన్ హాజరయ్యారు.

సర్వేపల్లి గొప్ప సంస్కర్త



వర్సిటీలో అనేక సంస్కరణలకు సర్వేపల్లి ఆద్యులు. ఆయనలాంటి గొప్ప వ్యక్తుల మార్గదర్శకత్వంలో వర్సిటీ నేడు ఈస్థాయికి చేరుకుంది. అటువంటి మహోన్నతమైన వ్యక్తుల ఆదర్శాలను ముందుకు తీసుకెళుతూ వందేళ్ల ఉత్సవాలకు సిద్ధమవుతున్నాం. దేశంలోని గొప్ప వర్సిటీల జాబితాలో ఏయూ ఉండాలన్న వారి సంకల్పానికి అనుగుణంగా పనిచేస్తున్నాం.

- వీసీ శశిభూషణరావు

అప్పట్లోనే ఏయూకు గుర్తింపు



సర్వేపల్లి రాధాకృష్ణన్ అప్పట్లోనే ఏయూ భవిష్యత్‌లో గొప్ప స్థానంలో ఉంటుందని ఊహిం చారు. ఆయన తన ఐదేళ్ల పాలనలో వర్సిటీ అభివృద్ధికి అద్భుతమైన ప్రణాళికలు రూపొందించారు. తొలి పాలకుల ఆశయాలకు అనుగుణంగా వర్సిటీని అభివృద్ధి పథంలో తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నాం. త్వరలోనే వందేళ్ల ఉత్సవాలు నిర్వహిస్తాం.

- ఇఎన్ ధనుంజయరావు, రిజిస్ట్రార్

78 మందికి జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు

వెంకోజీపాలెం, సెప్టెంబరు 4 : కొత్త వెంకోజీపాలెంలోని సీఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో గురువారం ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించనున్నట్టు కలెక్టర్ హరేంధిర ప్రసాద్ తెలిపారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడు దల చేశారు. ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణ విగ్రహానికి పూలమాలాంకరణ అనంతరం జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలు ప్రదానం చేస్తామని చెప్పారు. ఈఏడాది 78 మందిని పురస్కారాలకు ఎంపిక చేశామన్నారు. ఎంపికైన వారిలో... వై. వెంకటేశ్వరరావు (వెల్లంకి), బి. సూర్యప్రకాశరావు (కణితి),కాంతం (అక్కిరెడ్డిపాలెం), చిన్నయ్య (పెందుర్తి), రోజామణి (చిట్టివలస), త్రినాథరావు (గాజువాక మింది), హేమలత (చింతలాగ్రహారం), వినాయకి (ఆనందపురం),వెంకట నరసింగరావు (బర్మా కాలనీ), ప్రభాకర్ (ఆర్‌బీఎం యూపీ స్కూల్), టి. వెంకటలక్ష్మి (పెదగంట్యాడ), కె. లుధీయ (చినగదిలి), సుధామాధవి (చినగదిలి జెడ్పీహెచ్ఎస్), డి. మధు కొండలరావు (చంద్రంపాలెం జెడ్పీహెచ్ఎస్), పైడిరాజు (పద్మనాభం, జెడ్పీహెచ్ఎస్), కె.సూర్యకుమారి (గాజువాక జెడ్పీహెచ్ఎస్), ఆర్. సత్యవతి (యారాడ జెడ్పీహెచ్ఎస్), ఫాతిమా (గోపాలపట్నం జెడ్పీహెచ్ఎస్), సాయికుమారి (బోయపాలెం జెడ్పీహెచ్ఎస్), కె. గోపినాథ్ (సిర్లపాలెం జెడ్పీహెచ్ఎస్), డి. సత్యానారాయణ (చిట్టివలస జెడ్పీహెచ్ఎస్), కె. మురళీ కృష్ణ (చిట్టివలస జెడ్పీహెచ్ఎస్), కె. సుభాష్ బోస్ (అడివివరం జెడ్పీహెచ్ఎస్), కె. సూర్యకిరణ్ (పెదగంట్యాడ జెడ్పీహెచ్ఎస్), కె. మురళిధర్ (కపరాడ జెడ్పీహెచ్ఎస్), వీవీ నాగేశ్వరరావు (ప్రభుత్వ క్యాంప్ హెచ్ఎస్), కె.ఎస్.ఎస్ మోహన్(ఎంవీడీ హెచ్ఎస్), బి. శివప్రసాద్ (పెందుర్తి ప్రభుత్వ హెచ్ఎస్), రత్నం (గాజువాక జెడ్పీహెచ్ఎస్), నరసింహామూర్తి (ఇస్లాంపేట జెడ్పీహెచ్ఎస్), పి.వెంకటలక్ష్మి (భీమిలి జెడ్పీహెచ్ఎస్), బి. పద్మావతి (చినగదిలి, జెడ్పీహెచ్ఎస్), టి . రామారావు (మల్కాపురం జీవీఎంసీహెచ్ఎస్), జగదీష్ (పెందుర్తి జెడ్పీహెచ్ఎస్), కె. శారద (ఆనందపురం జెడ్పీహెచ్ఎస్), రాజన మంగమ్మ (పెదగంట్యాడ జెడ్పీహెచ్ఎస్), మహాలక్ష్మి (భీమిలి) వై. దయానందరావు (గోపాలపట్నం జెడ్పీహెచ్ఎస్), కె. కృష్ణ (పద్మనాభం జెడ్పీహెచ్ఎస్), ధర్మారావు (అక్కయ్యపాలెం జీవీఎంసీ హెచ్ఎస్), ఉన్నారు. అలాగే ఎన్. ప్రభాకర్ (మధురవాడ ఎంపీపీఎస్), ఆర్. శ్రీనివాసరావు (గాజువాక ఎంపీపీఎస్), ఎం. ఆశాలత (గాజువాక ఎంపీపీఎస్), సుదర్శన పట్నాయ్ (బాలచెరువు ఎంపీపీఎస్), ఎస్.జగన్నాథరావు (పెందుర్తి ఎంపీపీఎస్), విశ్వనాథం (అక్కయ్యపాలెం జీవీఎంసీహెచ్ఎస్), కొర్లాపు సుజాత (కేడీపీఎం హెచ్ఎస్), కిరణ్‌కుమార్ (చందాక ఎంపీపీఎస్), ఎం. రమాదేవి (భీమిలి పీఎన్ఎంఈ జీవీఎంసీ స్కూల్), కె. సన్యాసినాయుడు (భీమిలి ఎంపీపీఎస్), జి.ప్రభాకర్ (కోశానివానిపాలెం ఎంపీపీఎస్), వి. యర్రాజీరావు (దిబ్బపాలెం ఎంపీపీఎస్), నాయణ సుజాత (చినగదిలి ఎంపీపీఎస్),బాల (భగవాన్‌దాస్ కాలనీ ఎంపీపీఎస్), ఎల్.అనురాధ(సాయిరాం కాలనీ ఎంపీపీఎస్), బి. కళావతి (గాజువాక ఎంపీపీఎస్), కె. సత్యవతి (బుచ్చిరాజుపాలెం జీవీఎంసీ యూపీఎస్), పి.శ్రీదేవి (కంచరపాలెం జీవీఎంసీ పీఎస్), ఎం. పూర్ణశ్రీనివాస్ (సుభాష్‌నగర్ జీవీఎంసీపీఎస్), జి. మాధురి (సాంకేతపురం జీవీఎంసీ పీఎస్), ఆర్. హిమరాణి (మాధవధార జీవీఎంపీ పీఎస్), పి. రమణకుమారి (త్రినాథపురం జీవీఎంసీ పీఎస్), కె. రవికుమార్ (మహారాణిపేట జీవీఎంసీ పీఎస్), జవీ జయభారతి (ప్రకాశరావుపేట జీవీఎంసీ పీఎస్), సత్యవతి (మల్కాపురం జీవీఎంసీపీఎస్), వి. కన్నబాబు (ఎక్స్‌సర్వీస్‌మెన్ కాలనీ జీవీఎంసీ పీఎస్), శ్రావణి (గోపాలపట్నం జీవీఎంసీ పీఎస్), మోసుగంటి పీర్ (పద్మనాభం ఎంపీపీఎస్), పి. వెంకటరావు (పద్మనాభం ఎంపీ పీఎస్), టి. భాగ్యలత (పెదగంట్యాడ ఎంపీపీఎస్), షేక్ మదీనా బేగం (పెదగంట్యాడ, ఎంపీపీఎస్), టి. సూర్యప్రభావతి (నరవపాలెం ఎంపీపీఎస్), ఎ.రవి ప్రతాప్ (పెందపుర్తి ఎంపీ యూపీఎస్), ఎస్. సూర్యరావు (పాపాయారాజు పాలెం ఎంపీపీఎస్), చింతాల లలిత (శివాజీపాలెం జీవీఎంసీ పీఎస్), బి. దేముడుబాబు (మధురానగర్ జీవీఎంసీ పీఎస్), మేరి జోష్‌ఫైన్ (తారకరామ నగర్ ఎంపీపీఎస్), టి. అనిల్‌బాబు జోషి (ప్రభుత్వ క్వీన్ మేరి హెచ్ఎస్) ఉన్నారు.

పర్యాటక స్థలాలను సందర్శించిన కలెక్టర్

భీమునిపట్నం, సెప్టెంబరు 4 : పట్టణ పరిసర ప్రాంతాల్లో ఉన్న చారిత్రక ప్రదేశాలను కలెక్టర్ హరేంధిర ప్రసాద్ బుధవారం సందర్శించారు. తొలుత కీటిన్‌పేటలో వున్న పురాతన సెయింట్ పీటర్స్ చర్చిని దర్శించారు. చర్చి ప్రాముఖ్యతను పాస్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కుమ్మరిపాలెంలో వున్న డచ్ సిమెట్రీని, బీచ్‌రోడ్‌లో వున్న ఫ్లాగ్‌స్టాఫ్ సిమెట్రీని సందర్శించారు. ఫ్లాగ్ స్టాఫ్ సిమెట్రీలో 1768 నాటి సమాధి డూమ్‌కు అతికించిన నేమ్ ప్లేట్‌ను ఫొటో తీసుకున్నారు. సమాధుల విశిష్టతను పురావస్తు శాఖ టెక్నికల్ ఆఫీసర్ శ్రీనివాసరావు ఆయనకు వివరించారు. అలాగే తీరంలో వున్న లైట్‌హౌస్‌ను సందర్శించారు. అక్కడి నుంచి మంగమారిపేటలో వున్న తొట్ల కొండను, తిమ్మాపురం బావికొండను దర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో క్రూయిజ్ టూరిజం అభివృద్ధిలో భాగంగా విదేశీ పర్యాటకులను ఆకట్టుకునే విధంగా చర్యలు తీసుకోవాలని, కనీస వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. పొదలతో నిండిన డచ్ సమాధుల్లో ల్యాండ్ స్కేపింగ్ చేస్తే బాగుంటుందని చెప్పారు. పట్టణంలోని చిన్నబజారులో వున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కూడా సందర్శించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రామారావు, జడ్పీ కనకమహాలక్ష్మి,పురావస్తు శాఖాధికారులు, డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు పాఠాల బోధన

తగరపువలస : చిట్టివలస బాలుర ఉన్నత పాఠశాలను కలెక్టర్ హరేంధిర ప్రసాద్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పదో తరగతి విద్యార్థులకు అర్ధ గంట పాటు రెసెక్షన్ పాఠాన్ని బోధించారు. సీబీఎస్‌సీ అమలవుతున్న పాఠశాలగా మరింత ఉన్నతంగా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం బాలికల ఉన్నత పాఠశాలను కూడా సందర్శించారు. అలాగే అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి, సౌకర్యాలు, సరకుల పంపిణీ గురించి బాలింతలు, గర్భిణులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గర్భిణులకు పోషకాహార కిట్లు పంపిణీ చేశారు. నెలల చిన్నారికి ఐసీడీఎస్ అధికారులతో కలిసి అన్నప్రాసన చేశారు. ఈ కార్యక్రమంలో డీఈఓ చంద్రకళ, ఎంఈఓ శివరాణి, ఐసీడీఎస్ అధికారి జయదేవి పాల్గొన్నారు.



చిట్టివలస అంగన్వాడీ కేంద్రంలో చిన్నారికి అన్నప్రాసన చేస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

భాద్రపద మాసంలో వైదిక ఉత్సవాలు

సింహాచలం, సెప్టెంబరు 4 : వరాహలక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో భాద్రపద మాసంలో పలు వైదిక ఉత్సవాలు నిర్వహించనున్నట్టు దేవస్థానం అధికారులు తెలిపారు. బుధవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 5న స్వర్ణ పుష్పార్చన, 6న సహస్రనామ కుంకుమార్చన, బేడా తిరువీధి, 8న స్వాతి నక్షత్ర హవనం, 9న శ్రీనమ్మాళ్వార్ తిరు నక్షత్ర పూజలు, 12న మనవాళ మహామునుల మాస తిరు నక్షత్ర పూజలు, 13న సహస్రనామ కుంకుమార్చన, స్వామివారి పవిత్రోత్సవాలు పురస్కరించుకుని సాయంత్రం అంకురార్పణ జరగనుంది. అలాగే 14న ఏకాదశి పవిత్రాదివాసం, పవిత్ర పవిష్ఠ, గ్రామ తిరువీధి, 15 పవిత్ర సమర్పణ, గ్రామ తిరువీధి, కొండదిగువ వేంకటేశ్వరస్వామి దేవళంలో సుదర్శన హవనం, 16న పూర్ణాహుతి, పవిత్ర విసర్జనం, ఆరాధన, తిరువీధి, 17న నృసింహ మాస జయంతి, ఏకాంత స్నపన తిరుమంజనం, పవిత్రోత్సవాల సమాప్తి, సాయంత్రపు తిరువీధి, 18న భాద్రపద మాస పూర్ణిమ గ్రామ తిరువీధి, 19న స్వర్ణ పుష్పార్చన, మహాలయ పక్ష ప్రారంభం, 20న అమ్మవారి సన్నిధిలో శుక్రవార కుంకుమ పూజలు, బేడా తిరువీధి, 22న స్వర్ణపుష్పార్చన, 23న మాధవధార వేణుగోపాలస్వామి సన్నిధిలో అష్టాక్షరీ మంత్ర హవనం, 26న స్వర్ణ పుష్పార్చన, సింహగిరిపై సీతారామస్వామి ఆలయంలో సంక్షిప్త రామాయణం, షడక్షరీ మంత్ర హవనం, 27న అమ్మవారి సన్నిధిలో సహస్ర కుంకుమార్చన, సాయంత్రం బేడా తిరువీధి, 28న భాద్రపదమాస బహుళపక్ష ఏకాదశి స్వర్ణ తులసీ దళార్చన, గ్రామతిరువీధి, 29న స్వర్ణ పుష్పార్చన, ఇతర వైదిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

అంకితభావంతో పని చేయండి : వీసీ

వెంకోజీపాలెం, సెప్టెంబరు 4 : ఉద్యోగులు ఏయూ పట్ల అంకితభావంతో పని చేయాలని వీసీ ఆచార్య శశిభూషణరావు అన్నారు. బుధవారం ఆయన ఏయూ సెనేట్ మందిరంలో బోధనేతర సిబ్బంది, సెక్యూరిటీ సిబ్బంది, ట్రాన్స్‌పోర్ట్ విభాగం అధికారులతో వేర్వేరుగా సమావేశమయ్యారు.

భీమిలి సీఐగా సుధాకర్ బాధ్యతల స్వీకరణ

భీమునిపట్నం, సెప్టెంబరు 4 : భీమిలి పోలీస్ స్టేషన్ లా అండ్ ఆర్డర్ సీఐగా బొడ్డేపల్లి సుధాకర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఏఎస్ఆర్ జిల్లా పాడేరు సోషల్ మీడియా సెల్ సీఐగా పనిచేసిన ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేసిన సీఐను విశాఖ కమిషనరేట్‌కు వీఆర్‌కు వెళ్లారు.

బాలిక హత్య కేసులో నిందితుడికి 20 ఏళ్లు జైలు

విశాఖపట్నం (లీగల్), సెప్టెంబరు 4 : బాలికపై లైంగిక దాడికి పాల్పడి ఆమె మృతికి కారణమైన యువకుడికి 20 ఏళ్లు జైలు శిక్ష, రూ. 50 వేలు జరిమానా విధిస్తూ పోక్సో న్యాయస్థానం జడ్జి ఆనంది బుధవారం తీర్పు వెల్లడించారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో ఏడాది జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని తీర్పులో పేర్కొన్నారు. అలాగే బాధితురాలి కుటుంబ సభ్యులకు నిందితుడు రూ.1,50 లక్షలు ఇవ్వాలని, ప్రభుత్వం రూ. 3 లక్షలు ఇవ్వాలని ఆదేశించారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ కరణం కృష్ణ తెలిపిన వివరాలు ప్రకారం.. బాధితురాలు (13) తన కుటుంబ సభ్యులతో కలిసి దువ్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఒక అపార్టమెంట్‌లో నివసిస్తున్నారు. అక్కడికి సమీపంలోనే దిగుమర్తి నరేష్ (28) కార్పెంటర్‌గా పని చేసేవాడు. ఈ క్రమంలో బాలికకు నరేష్‌తో పరిచయం ఏర్పడింది. అది శారీరక సంబంధానికి దారి తీసింది. 2021 అక్టోబరు 5న రాత్రి నరేష్ ఫోన్ చేయడంతో బాలిక అతని రూమ్‌కు వెళ్లింది. ఈలోపు బాలిక కనిపించలేదని ఆమె తండ్రి చుట్టుపక్కల వెతకడం ప్రారంభించాడు. గమనించిన నరేష్ బాలికను తన గది వెనుక వైపు నుంచి బయటకు వెళ్లిపొమ్మని హెచ్చరించాడు. తల్లిదండ్రులకు భయపడిన బాలిక అదే అపార్టమెంట్‌పైకి వెళ్లి అక్కడ నుంచి కిందకు దూకింది. తీవ్రంగా గాయ పడడంతో అక్కడికక్కడే మృతి చెందింది. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు దువ్వాడ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు అనంతరం చార్జిషీట్ దాఖలు చేశారు. వాదోపవాదాల అనంతరం నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు. పూర్తి సాంకేతిక పరిజ్ఞానంతో కేసును దర్యాప్తు చేసిన దువ్వాడ పోలీస్ అధికారులను న్యాయమూర్తి అభినందించారు.

డేటా చౌర్యం దేశ అంతర్గత భద్రతకు నష్టం

విశాఖపట్నం, సెప్టెంబరు 4 : డేటా చౌర్యం దేశ అంతర్గత భద్రతకు నష్టం కలిగిస్తుందని భారత రక్షణ శాఖ ముఖ్య సలహాదారు లెఫ్టినెంట్ జనరల్ (రిటైర్డ్) వినోద్‌గా కండేరి అన్నారు. బుధవారం ఆయన నగరంలోని ఓ హోటల్‌లో జరిగిన భారతీయ ప్రతిరక్షా మజ్దూర్ సంఘ్ జాతీయ కార్యవర్గ సమావేశాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో బీపీఎంఎస్ జాతీయ అధ్యక్షుడు దినేష్ గౌతమ్, కార్యనిర్వాహక అధ్యక్షుడు బీరేంద్ర సింగ్, కార్యదర్శి విద్యాసాగర్, ఎంవీఎస్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ శ్రీభరత్

ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేయండి : ఎంపీ శ్రీభరత్

విశాఖపట్నం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : నేషనల్ హైవే అథారిటీకి సంబంధించిన ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేయాలని ఎంపీ శ్రీభరత్ ఆదేశించారు. బుధవారం ఆయన ఆ శాఖ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సబ్బవరం - షీలానగర్ ఆరు లైన్ల రోడ్డు పనుల స్టేటస్, కాన్వెంట్ జంక్షన్ నుంచి పోర్టు వరకు జరుగుతున్న హైవే పనుల వివరాలను అడిగి తెలు సుకున్నారు. ఆనందపురం పూల మార్కెట్ వద్ద ఉన్న సర్వీసు రోడ్డు సమస్యను ఎంపీ అధికారుల వద్ద ప్రస్తావించారు. ప్రజలు ఎదుర్కొంటున్న అసౌకర్యాలపై దృష్టిసారించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో టీడీపీ విశాఖ పార్లమెంట్ అధ్యక్షుడు గండి బాబ్జీ, నేషనల్ హైవే అథారిటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రభాత్ రంజన్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వీఎంఆర్‌డీఏ ఆవిర్భావ దినోత్సవం

సిరిపురం, సెప్టెంబరు 4 : వీఎంఆర్‌డీఏ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సిరిపురంలోని ఆ సంస్థ చిల్డ్రన్స్ థియేటర్‌లో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్ శిబిరాన్ని ప్రారంభించి, రక్తదానం చేశారు. కార్యక్రమంలో వీఎంఆర్‌డీఏ సంస్థ కార్యదర్శి దాట్ల కీర్తి, ఎస్టేట్ అధికారి లక్ష్మారెడ్డి, హరిప్రసాద్, ఎస్ఈ బలరామరాజు, ఇంజనీర్ రామరాజు, రేంజ్ ఆఫీసర్లు శ్యామల, శివానీ తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న విశ్వనాథన్

వరద బాధితులకు ఆహారం పంపిణీ



ఆహార సామగ్రితో డీఆర్‌డీఏ అధికారులు, సిబ్బంది

ఎంవీపీ కాలనీ,సెప్టెంబరు 4 : డీఆర్‌డీఏ ముఖ్య కార్యదర్శి ఆదేశాల మేరకు విజయవాడ వరద బాధితులకు జిల్లా సమాఖ్య, గ్రామీణాభివద్ధి సంస్థ 5 వేల ఆహార పొట్లాలు, 1800 తాగునీటి బాటిళ్లు, 3 వేల టెట్రా పాల ప్యాకెట్లు, రెండు వేల బిస్కట్ ప్యాకెట్లు రెండు లారీల్లో బుధవారం తరలించారు. వీటిని విజయవాడ మున్సిపల్ స్టేడియంలో అధికారులకు అందించినట్టు పథక సంచాలకులు ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరు సూచన మేరకు పెందుర్తి మహిళా ప్రగతి కేంద్రం జిల్లా సమాఖ్య సభ్యులు, వీఏఏలు, గ్రామీణాభివద్ధి సంస్థ సిబ్బంది పులిహోర ప్యాకెట్లు తయారు చేశారన్నారు.

రొట్టెలు, బిస్కెట్లు పంపించిన వెలగపూడి

విజయవాడలోని వరద బాధితులకు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు రొట్టెలు, బిస్కెట్లు పంపించారు. ఎంవీపీ కాలనీలోని తన క్యాంపు కార్యాలయం నుంచి బుధవారం సాయంత్రం వ్యాన్ ద్వారా 3 వేల ప్యాకెట్ల బిస్కెట్లు, 1500 రొట్టెలు, 24 వేల వాటర్ బాటిళ్లు పంపించారు.

వరద సహాయక చర్యల్లో జీవీఎంసీ సిబ్బంది

వెంకోజీపాలెం : వరద సహాయక చర్యల్లో పాల్గొనేందుకు జీవీఎంసీ అధికారులు, ఉద్యోగులు, పారిశుధ్య కార్మికులు మంగళవారం అర్ధరాత్రి విజయవాడకు చేరుకుని ముంపు ప్రాంతాల్లో సేవలందిస్తున్నారని కమిషనర్ సంపత్‌కుమార్ తెలిపారు. వరదల్లో చిక్కుకున్న ప్రజలకు ఆహార ప్యాకెట్లు, వాటర్ బాటిళ్లు జీవీఎంసీ ఉద్యోగులతో కలిసి పంపిణీ చేస్తున్నామన్నారు.

టీఎన్ఎస్ఎఫ్ సేవలు

వరద బాధితులను టీఎన్ఎస్ఎఫ్ శ్రేణులు ఆదుకుంటున్నాయని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రణవ్ గోపాల్ చెప్పారు. విశాఖ నుంచి ప్రత్యేక వాహనంలో బాధితులకు మంచినీటి బాటిళ్లు, కేక్‌లు, రొట్టెలు, కొవ్వొత్తులు, డెటాయిల్ సబ్బులు, దుప్పట్లు పంపించినట్టు తెలిపారు.

ఏయూ ఉద్యోగులు ఒక రోజు వేతనం విరాళం

ఏయూ బోధన, బోధనేతర ఉద్యోగులు ఒక రోజు మూల వేతనాన్ని బాధితుల సహాయార్థం ఇవ్వనున్నట్టు వీసీ ఆచార్య జి. శశిభూషణరావు తెలిపారు. త్వరలో ఈ మొత్తాన్ని ముఖ్యమంత్రి సహాయ నిధికి పంపనున్నట్టు ఆయన చెప్పారు.

18 వేల కొవ్వొత్తుల ప్యాకెట్లు, 20 వేల అగ్గిపెట్టె బాక్సులు

విశాఖపట్నం : జిల్లా పౌర సరఫరాల అధికారి గూన సూర్యప్రకాశరావు 18 వేల కొవ్వొత్తుల ప్యాకెట్లు, 20 వేల అగ్గిపెట్టె బాక్సులు కొనుగోలు చేసి వ్యాన్‌లో విజయవాడకు పంపించారు. విజయవాడలో విధులు నిర్వహించేందుకు ఆయనతో పాటు ఇద్దరు ఏఎస్‌వోలు, నలుగురు చెకింగ్ ఇన్‌స్పెక్టర్లు బయలుదేరి వెళ్లారు.

చోరీ నిందితుడ్ని పట్టుకున్న ఎంవీపీ పోలీసులు

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 4 : ఎంవీపీ క్రైమ్ పోలీసులు ఫిర్యాదు అందిన 24 గంటల్లో చోరీ చేసిన నిందితుడ్ని పట్టుకున్నారు. ద్వారకా జోన్ నేర విభాగం సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలు ప్రకారం.. ఎంవీపీ కాలనీ పన్నెండో సెక్టర్ నంది ఆలయం సమీపంలో టెక్నోసిస్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్‌లో జంధ్యాల హేమ చందు (33) సేల్స్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. అతను జాలారి ఎండాడ ప్రాంతంలో నివాసం ఉంటున్నాడు. పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురం మండలం, మామిడిపల్లి స్వగ్రామం. చెడు వ్యసనాలకు బానిసైన చందు గతనెల 7న తన కార్యాలయం యజమాని అన్నపూర్ణ హ్యాండు బ్యాగులోని రెండు బంగారు గాజులు, రూ. వెయ్యి నగదు దొంగలించాడు. ఈనెల 2న ఆమె బ్యాగు చూడగా బంగారం, నగదు లేకపోవడంతో ఎంవీపీ పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ రాజు ఆధ్వర్యంలో హెడ్ కానిస్టేబుల్ రామకష్ణ, కానిస్టేబుళ్లు శ్రీనివాసరావు, రవికుమార్, సాయి చురుగ్గా దర్యాప్తు చేసి, నిందితుడ్ని బుధవారం అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి బంగారు గాజులు స్వాధీనం చేసుకున్నారు. సిబ్బందిని కమిషనర్ శంకబ్రత బాగ్చి అభినందించారు.

మద్దిలపాలెంలో వాహన తనిఖీలు

మద్దిలపాలెం, సెప్టెంబరు 4 : మద్దిలపాలెం జంక్షన్‌లో ట్రాఫిక్ పోలీసులు బుధవారం వాహన తనిఖీలు చేపట్టారు. ట్రాఫిక్ ఎస్ఐ వడ్డి కనకరావు సారధ్యంలో సిబ్బంది హెల్మెట్ ధరించని వారు, ట్రిపుల్ రైడింగ్, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవ్ చేస్తున్న వారిపై కేసులు నమోదు చేశారు.